ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం
సోమవారం 2, డిసెంబరు 2024


ఒంగోలు బాపూజీ కాంప్లెక్స్ సెల్లార్లో నిద్రిస్తున్న అభాగ్యులు

వైసీపీ ఐదేళ్ల పాలనలో నిరాశ్రయుల పైనా నిర్దయ ప్రదర్శించింది. నిలువనీడ లేకుండా చేసింది. అంతకుముందు టీడీపీ హయాంలో ఆశ్రయం కల్పించిన నైట్ షెల్టర్లను సైతం మూసివేసింది. కొన్నిచోట్ల వాటిని ఇతరత్రా అవసరాలకు వినియోగించుకుంది. నాటి టీడీపీ ప్రభుత్వంలో అభాగ్యులకు ఉదయం, రాత్రి వేళల్లో భోజనం ఉచితంగా అందించగా దాన్ని కూడా దూరం చేసి కడుపు మాడ్చింది. దీంతో యాచకులు, ఆదరణ కరువై కుటుంబాలకు దూరంగా ఉంటున్న వృద్ధులు, అనాథలు అల్లాడిపోతున్నారు. బస్టాండ్‌లు, ఫుట్‌పాత్‌లు, వంతెనల వద్ద ఆశ్రయం పొందుతున్నారు. వర్ష, చలికాలాల్లో వణికిపోతున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నైట్ షెల్టర్ల పునఃప్రారంభానికి చర్యలు తీసుకుంటోంది.

ఆశ్రయం లేక అల్లాడుతున్నారు


రిమ్స్‌లో నిరుపయోగంగా ఉన్న నిరాశ్రయుల కోసం నిర్మించిన భవనం

- వైసీపీ పాలనలో నిరాశ్రయులపై నిర్దయ
- టీడీపీ హయాంలో ప్రారంభించిన నైట్‌షెల్టర్లు మూసివేత
- వీధులు, ఫుట్‌పాత్‌లపైనే వందల మంది
- చలికి వణుకుతూ అవస్థ
- ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- పునఃప్రారంభానికి చర్యలు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాంతాల్లో చాలా వరకు ఇళ్లు లేని పేదలు కనిపిస్తుంటారు. వీరితోపాటు కొందరు బతుకుదెరువు కోసం పట్టణాలకు వచ్చి పనిదొరక్క ఫుట్‌పాత్‌లపై జీవిస్తున్నారు. యాచకులు, అనాథలూ నిరాశ్రయులుగా ఉన్నారు. పగలు దొరికింది తిని కాలం వెళ్లబుచ్చే వీరికి రాత్రి వేళ గూడు కరువైంది. గ్రామాల నుంచి వివిధ పనులపై పట్టణాలకు వచ్చే పేదలూ ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. బస్టాండ్‌లు, పార్కుల్లో పడుకొంటున్నారు. వానకు తడుస్తూ, చలికి వణుకుతూ అనేక ఇబ్బందులు పడుతున్నారు.

టీడీపీ హయాంలో నైట్ షెల్టర్లు ఏర్పాటు

నగరాలు, పట్టణాల్లోని నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించేందుకు గత తెలుగుదేశం ప్రభుత్వం (2014-19) చొరవచూపింది. నైట్ షెల్టర్లు ఏర్పాటు చేసింది. ఉదయం, సాయంత్రం ఆహారం అందించడంతో పాటు రాత్రికి వసతి కల్పించింది. పడుకునేందుకు మంచాలు, కప్పుకునేందుకు దుప్పట్లు ఇచ్చింది. జిల్లాలోని ఒంగోలు కార్పొరేషన్, మార్కాపురం మునిసిపాలిటీ, గిద్దలూరు నగర పంచాయతీలో ఏర్పాటు చేసిన నైట్ షెల్టర్లలో అనేక మంది ఆశ్రయం పొందారు. అప్పట్లో నిర్వహణ ఖర్చును ఆయా పురపాలక సంస్థల జనరల్ ఫండ్, మెప్మా నుంచి కొంత కేటాయించారు. అనంతరం కొద్దికాలానికి ఒంగోలులో షెల్టర్ నిర్వహణ బాధ్యతను పట్టణ సమాఖ్యకు, మార్కాపురం, గిద్దలూరులో స్వచ్ఛంద సంస్థకు అప్పగించారు. ఒక్కో సెంటర్‌లో 50 మందితో నిర్వహణకు ఏడాదికి అయ్యే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఖర్చు రూ.3లక్షలు, ఇద్దరు కేర్ టేకర్స్‌కు నెలకు రూ.5వేలు గౌరవ వేతనం కింద పన్నెండు నెలలకు రూ.1.2 లక్షలు.. తాగునీరు విద్యుత్, వంటగ్యాస్, వాచ్‌మన్‌కు కలిపి నెలకు రూ.6వేల చొప్పున ఏడాదికి రూ.72 వేలు, ఒక్కో వ్యక్తి భోజనానికి రూ.25 చొప్పున 12 నెలలకు రూ.4.5 లక్షలు ఖర్చవుతుందని ప్రభుత్వం నిర్ణయించి ఆ మొత్తాన్ని ఇచ్చింది.

పైసా ఇవ్వకుండా ప్రారంభోత్సవం

టీడీపీ హయాంలో జిల్లా కేంద్రమైన ఒంగోలులో నైట్ షెల్టర్‌ను 50 నుంచి 70 మందికి వసతి ఉండే విధంగా నిర్మించారు. కానీ ఆతర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జగనన్న మార్ట్ కోసం స్వాధీనం చేసుకొంది. నిరాశ్రయులను బయటకు పంపింది. దీంతో వారు ఫుట్‌పాత్‌లకే పరిమితమయ్యారు. ఆ తర్వాత జీజీహెచ్‌లో నూతనంగా రూ.60లక్షలతో భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. ఏడాది క్రితం అది పూర్తయ్యింది. నిర్వహణ ఖర్చుకు రూపాయి కూడా ఇవ్వకుండానే దాన్ని ప్రారంభించారు. దీంతో అలంకారప్రాయంగా మారింది.

వైసీపీ వచ్చాక రోడ్డున..

2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిరాశ్రయులపై కనీస కనికరం చూపకుండా నైట్ షెల్టర్‌లను మూసివేసింది. నిధులు కూడా ఇవ్వకపోవడంతో నిర్వాహకులు చేతులెత్తేశారు. గిద్దలూరులోనూ అంతంత మాత్రంగా నడుస్తోంది. టీడీపీ హయాంలో నగరంలోని స్థానిక ఊరచెరువులో ఉన్న కొత్త కూరగాయల మార్కెట్ ఎదురు ఏర్పాటు చేసిన నైట్ షెల్టర్‌లో ప్రస్తుతం మహిళా మార్టు నడుస్తోంది. మార్కాపురంలోని జవహర్ నగర్ కాలనీలో అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. అక్కడ నిత్యం 50 నుంచి 70 మంది ఆశ్రయం పొందేవారు. అది కూడా వైసీపీ పాలనలో మూతపడింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో అపార్టుమెంట్ నిర్మాణం జరుగుతోంది. దీంతో అభాగ్యులు ఆశ్రయం లేక అల్లాడుతున్నారు.

బస్టాండ్‌లు, ఫుట్‌పాత్‌లు, వంతెనలే ఆశ్రయం

రాష్ట్రంలో స్మార్ట్ సిటీ హోదాను సంతరించుకున్న నగరాలలో ఒంగోలు ఒకటి. దాదాపు 3లక్షల మంది జనాభా ఉండగా సుమారు 25 వేలకు పైగా పేద కుటుంబాలు మురికి వాడలకే పరిమితమై జీవనం సాగిస్తున్నాయి. అందులోనూ ప్రత్యేకించి ఏ ఆసరాలేని వారు వేల సంఖ్యలోనే ఉన్నారు. వారికి తినడానికి తిండి.. కట్టుకొనేందుకు దుస్తులు, ఉండటానికి వసతి కరువై దయనీయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. కటిక దారిద్ర్యం అనుభవిస్తూ అయిన వారి ఆదరణ కోల్పోయిన నిరాశ్రయులకు ఆర్టీసీ బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, ఫుట్‌పాత్‌లు, వంతెనలే ఆశ్రయమయ్యాయి.


ఒంగోలులో డివైడర్ మధ్యలో చలికి ముడగదీసుకుని నిద్రిస్తున్న అభాగ్యులు

పునఃప్రారంభానికి కూటమి ప్రభుత్వం చర్యలు

నైట్ షెల్టర్లను పునఃప్రారంభంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అందుకు అవసరమైన చర్యలను చేపట్టింది. ఇప్పటికే మెప్మా అధికారులను సమాచారం కోరగా వారు పంపించారు. ఒంగోలులో నైట్ షెల్టర్ నిర్వహణకు అవసరమైన ప్రతిపాదనలు, నిధుల అవసరాన్ని నివేదించారు. త్వరలోనే నైట్ షెల్టర్లు తిరిగి తెరుచుకునే అవకాశం ఉంది.

నిర్వహణ కోసం ఎంవోయూ

జీజీహెచ్‌లో నైట్ షెల్టర్ నిర్మాణం పూర్తయ్యింది. నిర్వహణ బాధ్యతలను రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించాం. ఇందుకు సంబంధించి మెప్మా, కార్పొరేషన్, రెడ్‌క్రాస్ మధ్య ఎంవోయూ కుదిరింది. వారికి అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసి ఇవ్వాల్సి ఉంది. అందుకు 2లక్షల రూపాయలు ఖర్చవుతుంది. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన తర్వాత ఫర్నిచర్ కొనుగోలు చేసి ఇస్తాం. ఆ తర్వాత ఐదేళ్లపాటు నిర్వహణ బాధ్యతను పూర్తిగా రెడ్‌క్రాస్ చూసుకుంటుంది. తేళ్ల రవికుమార్, మెప్మా పీడీ

రైతుకు రక్ష

- ఈ-పంట నమోదుతో భరోసా
- ప్రభుత్వ సాయంలో అదే ప్రామాణికం
- బీమా చెల్లింపులోనూ ప్రధానం
- ఖరీఫ్‌లో 98శాతం పూర్తి
- రబీ పంటల నమోదు ప్రారంభం
- ఈసారి ఖాళీ పొలాల వివరాలూ సేకరణ

7


ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు

ఆటల్లో అదుర్స్



- సత్తాచాటుతున్న పాకల విద్యార్థులు
- ఏడాదిలో 40 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక
- పలు విభాగాల్లో ప్రతిభ చూపుతున్న ఆటగాళ్లు

7

ముగిసిన కార్తీక మాసం

- నేడు పోలి పాడ్యమి
- నీటిలో దీపాలు వదలనున్న మహిళలు

7

వలస పక్షుల కిలకళ

ప్రపంచంలోనే రోజుకు అత్యంత దూరం ప్రయాణించే వాటిల్లో ఒకటైన బార్‌హెడ్ గూస్ పక్షులు ఆదివారం కంభం మండలం తురిమెళ్లలోని తప్పెటవాని చెరువుకు చేరుకున్నాయి. వీటిని చూసేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. మధ్య ఆసియాలో అత్యధికంగా ఉండే ఈ పక్షులు ఏటా శీతాకాలంలో సంతానోత్పత్తి కోసం దక్షిణ భారతదేశ ప్రాంతాలకు వలస వస్తాయి. వాటిలో కొన్ని తురిమెళ్ల చెరువుకు చేరుకుంటాయి. రెండు నెలలు ఇక్కడే ఉంటాయి. గుడ్లు పెట్టిన తరువాత పొదిగి పిల్లలకు ఎగిరే సామర్థ్యం వచ్చాక తిరిగి మధ్య ఆసియాకు వెళుతుంటాయి. ఈ ఏడాది వీటి రాకతో ఆ ప్రాంతం కళకళలాడుతోంది. ఈ పక్షి ఒక్క రోజులో 1,600 కిలోమీటర్లు ప్రయాణిస్తాయని గతంలోనే నిపుణులు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, కంభం



- ఎంపీ మాగుంట పిలుపు
- ఒంగోలులో అవగాహన ర్యాలీ


హెచ్‌ఐవీని తరిమికొడదాం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హెచ్‌ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకొని దాన్ని తరిమికొట్టాలని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. అందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని మాగుంట జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. హెచ్‌ఐవీ/ఎయిడ్స్ అనేది ఒక్కరి సమస్య కాదని, అందరిదీ అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ జమున మాట్లాడుతూ 15 నుంచి 49 ఏళ్ల వయసు కలిగిన వారు హెచ్‌ఐవీ బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న ఏఆర్‌టీ మందులను సద్వినియోగించుకోవాలన్నారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి శ్యాంబాబు మాట్లాడుతూ హెచ్‌ఐవీని అరికట్టేందుకు ప్రజలకు విస్తృత అవగాన కల్పించాలన్నారు. వ్యాధిగ్రస్థులకు న్యాయపరమైన సమస్యలు ఉంటే సహాయసహకారాలు అందిస్తామన్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ నెల్లూరు బస్టాండు మీదుగా అంబేడ్కర్ భవన్‌కు చేరుకుంది. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పి.పద్మజ, డాక్టర్ బాలాజీ నాయక్, రిమ్స్ ఏఆర్‌టీ సెంటర్ ఎస్ఎంవో డాక్టర్ జోసఫ్ శామ్యూల్, డాక్టర్ శ్రీవాణి, నియంత్రణ సంస్థల ప్రతినిధులు పి.కిరణ్, చంద్రమోహన్, ఎం.పీర్‌బాషా, సునీల్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎంపీ మాగుంట, డీఎంహెచ్‌వో పద్మజ

కమనీయం.. కార్తీక నర్తనం


ఒంగోలులోని కేశవస్వామి పేటలో ఉన్న కాశీవిశ్వేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో బాల నృత్యకారులు

కార్తీక మాసం ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి ఒంగోలు కేశవస్వామి పేటలోని శ్రీగంగా పార్వతీ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్తీక నర్తనం భక్తులను అలరించింది. 50 మంది చిన్నారులు కలిసి గణపతి స్తవం, అన్నమాచార్య కీర్తనలు, భక్తిగీతాలకు చక్కటి హావభావాలతో పరమేశ్వరునికి నృత్య నీరాజనం చేశారు. చందు డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు త్రోవగుంట చందు పర్యవేక్షించారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు కల్చరల్


తీపికబురు

- రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారికి చంద్రబాబు భరోసా
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- వచ్చే నెలలో కొత్తవి మంజూరు
- చేర్పులు, మార్పులకు అవకాశం
- అన్ని పథకాలకూ అదే ప్రామాణికం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రేషన్ కార్డులు లేక జిల్లావ్యాప్తంగా వేలాదిమంది పేదలు పథకాలకు దూరమయ్యారు. కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయారు. వారికి ఇప్పుడు కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. కొత్త రేషన్ కార్డుల కోసం సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. వచ్చే నెలలో అర్హులకు వాటిని మంజూరు చేయనుంది.

ఐదేళ్లుగా పథకాలకు దూరం

వైసీపీ ఐదేళ్ల పాలనలో రేషన్ కార్డులు లేక పేదలు, వృద్ధులు, వితంతువులు సామాజిక పింఛన్లతోపాటు ప్రభుత్వ పథకాలను పొందలేకపోయారు. ప్రతి దానికీ రేషన్‌కార్డు ప్రామాణికం కావడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం ఉచితంగా అందించే వైద్యసేవలను కూడా పొందలేకపోయారు. ఇంకోవైపు రేషన్ కార్డుల్లో తప్పుగా నమోదైన పేర్లను మార్చేందుకు కూడా గత వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారిలో ఆశలు చిగురించాయి. అందుకు అనుగుణంగానే ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీకి సిద్ధమైంది.



అర్హులందరికీ మంజూరు చేస్తాం

ఎస్.పద్మశ్రీ, డీఎస్‌వో

జిల్లాలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తాం. ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సోమవారం నుంచి సచివాలయాల్లో దరఖాస్తులను స్వీకరిస్తారు. వాటిని పరిశీలించిన అనంతరం ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కార్డులను జారీచేస్తాం. ఇంకోవైపు రేషన్ కార్డుల్లో చేర్పులు, చేర్పులు, తొలగింపుల కోసం ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

ఇప్పటికే 20వేల మంది దరఖాస్తు

జిల్లాలో 1,392 రేషన్‌షాపులు ఉండగా వాటి పరిధిలో సుమారు 6.68లక్షల కార్డులు ఉన్నాయి. కొత్తవి కోరుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 20వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం వచ్చినవి మరో ఏడెనిమిది వేల వరకూ ఉన్నాయి. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం అటు ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చడంతోపాటు కొత్త కార్డుల జారీకి నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి సచివాలయాల ద్వారా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరించనున్నారు. అనంతరం పరిశీలించి అర్హులను గుర్తిస్తారు. నూతన సంవత్సరంలో అర్హులందరికీ కార్డులు జారీ చేయనున్నారు.

5న హైందవ శంఖారావం


సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు

సంతనూతలపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 5న జరగనున్న హైందవశంఖారావాన్ని జయప్రదం చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా నాయకులు వి.మార్కండేయులు పిలుపునిచ్చారు. ఆదివారం సంతనూతలపాడులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మం ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. హైందవ ఆచార, వ్యవహారాలను పాటించడమే హిందుత్వమని చెప్పారు. హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు తెల్లమేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ డిసెంబరు 7న అంతర్జాతీయ గీతామహోత్సవం సందర్భంగా భగవద్గీత బోధనలను జరుపుకునే పండుగ అని అన్నారు. ఈ పండుగ గీత జన్మస్థలమైన కురుక్షేత్రంలో జరుగుతుందని, సంస్కృతి, కళ, ఆధ్యాత్మిక కలయిక అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటా గీతా పారాయణం, భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆర్‌ఎ.ప్రసాద్, మధు, సంజీవరెడ్డి, ఆత్రేయ, రామారావు, చెంచిరెడ్డి, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాగుంట సుబ్బరామరెడ్డికి నివాళి


మాగుంట విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

సంతనూతలపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతిని ఆదివారం సంతనూతలపాడులోని మాగుంట సుబ్బరామరెడ్డి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్దనున్న సుబ్బరామిరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల బృందం వెంకటేశ్వరరెడ్డి, శివారెడ్డి, అధ్యాపకులు, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

5న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

సంతనూతలపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీ హైస్కూల్లో ఈనెల5న రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలు ఘనంగా ప్రారంభం కానున్నట్లు కబడ్డీ అసోసియేషన్ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను సూదనగుంటకృష్ణమూర్తి, అసోసియేషన్ ప్రెసిడెంట్ కుర్రా భాస్కరరావు, ఉపాధ్యక్షులు ఎస్.రంగారావు, రమేష్, పీడీలు పరిశీలించారు. పోటీలను ప్రముఖులచే ఘనంగా ప్రారంభిస్తారని, గత 32 ఏళ్ల క్రితం జిల్లాలో చినపవనిలో జరిగాయని, ప్రస్తుతం ఇక్కడ జరగబోతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాలి : సీపీఎం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగర పాలకసంస్థలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.700 కోట్లు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం రమేష్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు మునిసిపాలిటీగా ఏర్పడి 148 ఏళ్ళు కాగా నగర పాలక సంస్థ ఏర్పడి 12 ఏళ్ళు అవుతుందన్నారు. కానీ నగరంలో జనాభా పెరుగుతున్నా తగిన విధంగా అభివృద్ధి లేదన్నారు. నగర అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి తదనుగుణ చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నందున అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. అందుకోసం స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ జోక్యం చేసుకోవాలని కోరారు. ఒంగోలు అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు తంబి శ్రీనివాసరావు, వీరస్వామి, ఎస్‌డీ.హుస్సేన్, బీవీ.రావు, టి.మహేష్, కె.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, దారా వెంకటేశ్వర్లు, జి.ఆదిలక్ష్మి, జి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

గుండ్లకమ్మ ప్రాజెక్టుకు సందర్శకుల కళ


బోటు షికారు కోసం వేచివున్న పర్యాటకులు

మద్దిపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ ప్రాజెక్టును ఆదివారం ప్రజలు పెద్దసంఖ్యలో సందర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి బస్సులు, సొంత వాహనాలపై కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చిన వారు ఆటపాటలతో సందడి చేశారు. అదేవిధంగా ప్రాజెక్టు వద్ద ఉన్న పార్కులో ఇతర ప్రాంతాలలో సెల్ఫీలు దిగుతూ ఆనందంతో కేరింతలు కొట్టారు. ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు చేసే విధానాన్ని సైతం ప్రజలు ఆసక్తిగా తిలకించారు. అనంతరం వారు శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు.

పోక్సోకేసు నమోదు

సంతనూతలపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి పోక్సో కేసు నమోదైంది. స్టేషన్ రైటర్ విజయభాస్కర్ తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని ఎనికపాడుకు చెందిన కె.హరిప్రసాద్ అనే యువకుడు మైనర్ బాలికను ఫోన్ ద్వారా మెసేజ్ చేసి వేధిస్తున్నారనే ఫిర్యాదు అందడంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భాగ్యనగర్‌లో పైపులైను పనులు పూర్తి

- నేటి నుంచి యథాతథంగా నీటి సరఫరా
- కమిషనర్ వెంకటేశ్వరరావు


నూతన పైపులైన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని భాగ్యనగర్‌లో ప్రధాన పైపులైను పనులు పూర్తయినందున సోమవారం నుంచి యధాతథంగా నీటి సరఫరా జరుగుతుందని కమిషనర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భాగ్యనగర్ 4వ లైనులో గతంలో నిర్మించిన పైపులైనులు లీకులు, ఇతర సమస్యలతో పదే పదే ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో కొత్తగా పైపులైనులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నవంబరు 25 నుంచి పనులు చేపట్టగా ఆదివారం నాటికి పూర్తయ్యాయని తెలిపారు. కాగా వారం రోజుల నుంచి నగరంలోని పలు కాలనీలకు నీటి సరఫరా నిలిచిపోయిన కారణంగా ప్రజలు కొంత అసౌకర్యానికి గురైనట్లు తెలిసిందన్నారు. అయితే నీటి సరఫరాలో ఇబ్బందులను తొలగించేందుకు శాశ్వత పరిష్కార దిశగా పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. నేటి నుంచి అన్ని కాలనీలకు ఎప్పటిలాగే నీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈ చంద్రయ్య, డీఈ పద్మజ, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ కె.నరసింహారావు, పలువురు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

యాదవుల అభ్యున్నతికి అన్ని విధాలా కృషి

- ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే దామచర్ల



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల, అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కొత్తపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): యాదవుల అభ్యున్నతికి అన్ని విధాల కృషి చేస్తామని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం కొత్తపట్నంలోని నల్లూరి గార్డెన్స్‌లో యాదవ వన భోజన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. తెలుగుదేశం పార్టీకి యాదవులు ఆదినుంచి వెన్నుదన్నుగా నిలిచారని, మీ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వపరంగా అందాల్సిన అన్ని సౌకర్యాలు యాదవులు అందేలా తగిన కృషి జరుపుతామని పేర్కొన్నారు. ఈ మహోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి ఎక్కువ సంఖ్యలో యాదవులు తరలివచ్చారు. పలువురు ప్రముఖులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. యాదవులు కుటుంబ సమేతంగా హాజరై వేడుకగా కార్తీక వన భోజనాలు చేశారు. ముందుకు వన పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య, టీటీడీ బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తి, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ కాటం అరుణమ్మ దంపతులు, బీజేపీ నాయకులు యోగయ్యయాదవ్, వైవీ.సుబ్బారావు, కొఠారి శ్రీనివాసరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్, రాచగొర్ల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలి

సూపర్ సిక్స్ పథకాలను పూర్తిగా అమలు చేయాలి ● సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ డిమాండ్



మాట్లాడుతున్న నారాయణ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ట్రూఅప్ చార్జీలపేరుతో ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలను ప్రభుత్వమే భరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం సీపీఐ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి కార్యవర్గ సభ్యుడు ఆర్.వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎటువంటి విద్యుత్ భారాలు ఉండవని హామీ ఇచ్చిందన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారాలు మోపడం దారుణంగా ఉందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకు ఈ విధంగా భారాలు వేయడం తగదన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు కేవలం పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలు మాత్రమే అమలు చేస్తున్నారని, మిగిలిన వాటిని కూడా అమలు చేయాలన్నారు. వ్యవసాయ పంటలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టును పారుదల శాఖమంత్రి సందర్శించినా ఎటువంటి ఉపయోగం లేకుండా పోయిందని విమర్శించారు. బడ్జెట్‌లో పూర్తి స్థాయిలో నిధులు కేటాయింపు లేని పరిస్థితి నెలకొందన్నారు. ఆ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు రూ.2వేల కోట్లు కేటాయించాలని నారాయణ డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 26వతేదీ నుంచి సీపీఐ శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డి.శ్రీనివాస్, అందే నాసరయ్య, ఎం.రమేష్, కె.వీరారెడ్డి, వి.హనుమారెడ్డి, ఎస్.రావమ్మ, ఆర్.రామకృష్ణ, ఎం.విజయ, ఎస్‌డీ.మౌలాలి, పి.ప్రభాకర్, నల్లూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యానికి కృషి చేసిన టి.కృష్ణ

- ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెంకటేశ్వర్లు


సంతాపసభలో ప్రసంగిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంచలన సినీ దర్శకులు టి.కృష్ణ సమాజ చైతన్యానికి ఎంతో కృషి చేశారని ప్రజా నాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) పేర్కొన్నారు. ఏపీ ప్రజా నాట్యమండలి, కృష్ణ మెమోరియల్ స్కూల్, కృష్ణ కల్చరల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో టి.కృష్ణ 38వ వర్ధంతి ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సభకు వి.సింగయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) మాట్లాడుతూ కళ కళ కోసం కాదని, ప్రజల కోసమని నమ్మి అనేక చిత్రాలను టి.కృష్ణ నిర్మించారని చెప్పారు. కేవలం ఆయన తీసింది ఆరు చిత్రాలైన ఆణిముత్యాలన్నారు. డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ వెండితెరపై టి.కృష్ణ వామపక్ష భావజాలాన్ని అద్భుతంగా ఆవిష్కరించారన్నారు. ప్రరసం అధ్యక్షుడు పొన్నూరి వెంకటశ్రీనివాసులు మాట్లాడుతూ టి.కృష్ణ తన చిత్రాలలో మహిళా సమస్యలకు పెద్దపీట వేశారని చెప్పారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ మాట్లాడుతూ సమాజంలోని రుగ్మతలను రూపుమాపేందుకు టి.కృష్ణ సినిమాలు ఎంతో దోహదం చేశాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నూనె అంకమ్మరావు, మిడసల మల్లికార్జునరావు, చిడిపోతు వెంకటేశ్వర్లు, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టి.కృష్ణ చిత్రపటానికి వారు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

నూతన సిలబస్‌పై అవగాహన పెంచుకోవాలి

- ఏపీటీసీఏ రాష్ట్ర నాయకుడు ప్రకాష్



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రకాష్

ఒంగోలు విద్య, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరం నుంచి మారిన కొత్త సిలబస్, పరీక్షల విధానంలో వచ్చిన మార్పులపై ప్రైవేటు పాఠశాలల అధ్యాపకులు అవగాహన పెంచుకోవాలని ఏపీటీసీఏ రాష్ట్ర నాయకుడు మాంటిస్సోరి ప్రకాష్ కోరారు. ఒంగోలులోని కృష్ణసాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ట్యూటోరియల్స్ అండ్ కాన్వెంట్స్ అసోసియేషన్ (ఏపీటీసీఏ) ఆధ్వర్యంలో జరిగిన నూతన సిలబస్ శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు విద్యాసంస్థల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉండాలన్నారు. అందరూ కలిసికట్టుగా ఉంటే విద్యార్థుల నైపుణ్యాలను పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడుతాయని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు జాలిరెడ్డి మాట్లాడుతూ శిక్షణ కోసం ఆడిటోరియంపై ధన్యవాదాలు తెలిపారు. కృష్ణసాయి, రైజ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ శిద్దా భరత్ మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా విద్యా వ్యవస్థ పట్ల ఉన్న అభిమానంతో కాలేజీని నడుపుతున్నామన్నారు. విద్యార్థులకు అవసరమైన సహాయసహకారాలు ఎల్లప్పుడు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నగర అధ్యక్షుడు జీవీవీ.లక్ష్మి, కార్యదర్శి శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షుడు రామిరెడ్డి, రవికాంత్, హనుమంతరావు, సతీష్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సముద్రతీరంలో సందడి చేస్తున్న పెద్దలు, పిల్లలు

తీరంలో కార్తీక సందడి

- భక్తుల సముద్రస్నానాలు


తీరానికి వెళ్లే దారిలో పర్యాటకుల రద్దీ

కొత్తపట్నం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నంలో సముద్ర తీరానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం ఆదివారంతో ముగియనుండటంతో భక్తులు వేలాదిగా తీరానికి తరలివచ్చారు. తీరంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తీక మాసం అంతా నిష్ఠతో గడిపిన భక్తులు చివరి రోజున సముద్ర స్నానాలు ఆచరించి భక్తులు ఇసుకతో సైకత లింగాలను ఏర్పాటు చేసి పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం కావడంతో తీరానికి పర్యాటకులు కూడా ఎక్కువ సంఖ్యలో తరలిరావటంతో కోలాహలం నెలకొంది. తుఫాన్ నేపథ్యంలో సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టారు.

రేపు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

- డీఈవో కిరణ్‌కుమార్

ఒంగోలు విద్య, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మండలాల్లో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించాలని డీఈవో ఎ.కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ఆదేశాలకు అనుగుణంగా దివ్యాంగ విద్యార్థులకు ఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వివిధ కేటగిరిలకు చెందిన దివ్యాంగులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను తరగతుల వారీగా నిర్వహించి విజేతలకు బహుమతులు అందించాలన్నారు. భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్స్ ఈ కార్యక్రమాల్లో, ఆటల పోటీల్లో పాల్గొనాలని సూచించారు. అనంతరం ఆయా ఫొటోలు, డాక్యుమెంటేషన్‌ను ప్రతి మండలం నుంచి జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు.

ఉపాధ్యాయుల సస్పెన్షన్లను రద్దు చేయాలి


మాట్లాడుతున్న కాంతారావు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారని, ఆయా సస్పెన్షన్లను రద్దు చేసి తిరిగి పోస్టింగ్‌లు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయుల సంఘం డిమాండ్ చేసింది. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు టీఎల్.కాంతారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. స్కూలు, ఎమ్మార్సీ గ్రాంటులను విడుదల చేయడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. అదే విధంగా స్కూలు కాంప్లెక్స్ గ్రాంటు కూడా విడుదల చేయాలని, ఈనెల 7న జరగనున్న మోగా పేటీఎంను జిల్లాలోని అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని కోరారు. ఎంఈవో-1, 2ల విధులను స్పష్టంగా సమానంగా కేటాయించాలని, 2017లో జరిగిన విధంగా కామన్ సీనియారిటీతో ఎంఈవోలు, డిప్యూటీడీఈవోలు, డైట్ లెక్చరర్లకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిలర్ మర్రి శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి జీఎస్‌ఆర్.సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతిపై హర్షం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వినతి మేరకు స్థానిక జిల్లావిద్యాశాఖ అధికారి కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌కు సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ డీఈవో కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖాధికారి కార్యాలయంలో గత నాలుగు నెలల నుంచి ఉద్యోగోన్నతి ప్రక్రియ పెండింగ్‌లో ఉందన్నారు. తమ సంఘం వినతి మేరకు డీఈవో పరిశీలించి కేవీ.సురేష్‌కు ఉద్యోగోన్నతి కల్పించారని, దీనిపై కార్యదర్శి వరకుమార్‌తో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రసన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


స్వామివారికి అన్నకోటి హారతి

ఒంగోలు(రూరల్), డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం కొప్పోలులోని శ్రీచెన్నకేశవస్వామి దేవాలయంలో గల శ్రీప్రసన్న అంజనేయ స్వామి వారికి కార్తీక మాసం అమావాస్య సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు ఈ సందర్భంగా స్వామివారికి 30కేజీల అన్నంతో అన్నకోటి ఉత్సవం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకుడు పరాకుశం సమీర్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలపై భారాలు మోపుతున్న ప్రభుత్వం

- వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వస్తే ఎలాంటి భారాలు ఉండవని చెప్పి, తీరా అధికారంలోకి వచ్చాక విస్మరించారని వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చారిజ చుండూరి రవిబాబు ఆరోపించారు. ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే ప్రజానీకంపై ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.15485.36 కోట్ల భారం వేశారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు నాయుడు మరోసారి తన హామీలకు తూట్లు పొడిచారని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోవాలని, లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు కేవీ.రమణారెడ్డి, కఠారి శంకర్, కఠారి ప్రసాద్, బొట్ల సుబ్బారావు, ఎస్‌కే.నాగూర్, మీరావలి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

ఒంగోలు (క్రైం), డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఒంగోలు-కరవది మధ్యలో గల పోతురాజు కాలువ సమీపాన ఆదివారం జరిగింది. సుమారు 35-40 మధ్య వయస్సు కలిగిన పురుషుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కేవీ.రమణ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. వివరాలు తెలిసినవారు 9440627647 సెల్ నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కార్తీకమాస పూజలు

సంతనూతలపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని శ్రీనాగేంద్రస్వామి, సుబ్రమణ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కార్తీకమాస, బహుళఅమావాస్య పర్వదినం పురస్కరించుకుని అర్చకులు సాయిశర్మ ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీవల్లిదేవసేన సమేత, సుబ్రమణ్యేశ్వరస్వామి కళ్యాణమహోత్సవం చేపట్టారు. తీర్థప్రసాదాలను అందజేశారు. కమిటీ సభ్యులు బూదాటి శ్రీను, రాజేష్‌గుప్తా, సన్నమూరి సుబ్బనాచారి, శరత్‌బాబు, జ్వాలా ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

సంతనూతలపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఐద్వా మండల కార్యదర్శి ఎస్.మాలతి కోరారు. ఆదివారం సంతనూతలపాడులోని సుందరయ్యభవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ దేశంలోను, ఇటు రాష్ట్రంలోను మహిళలు, చిన్నారులు అనే తేడా లేకుండా జరుగుతున్న ఘోరాలను అరికట్టడంతో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. మత్తుపదార్థాలు విపరీతంగా అందుబాటులోకి రావడంతో ఇటువంటి ఘోరాలు ఎక్కువైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి చట్టాలు అమలుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుజ్జి, నాగూర్‌బి, లక్ష్మి, మేఘన తదితరులు పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్ట్‌పై కార్యాచరణ నివేదిక: లంకా

అమరావతి, డిసెంబరు1(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్ట్‌పై తగిన చర్యలకు జలవనరులశాఖ మంత్రి రామానాయుడు అధికారులను ఆదేశించినట్లు 20సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గత అక్టోబరులో వెలిగొండ ప్రాజెక్ట్‌ని సందర్శించి, ఇచ్చిన నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, తగిన కార్యాచరణకు ఉపక్రమించాలని జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిని ఆదేశించిన మంత్రికి దినకర్ ధన్యవాదాలు తెలిపారు.

అలరించిన సంగీత విభావరి

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఆర్.మున్నంగి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఈ సందర్భంగా ముందుగా ఘంటసాల, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్ర పటాలకు గాయనీగాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ గాయని డాక్టర్ మున్నంగి రాజకుమారి ఆధ్వర్యంలో కొనసాగిన సంగీత విభావరిలో గాయకులు విజయ్, పూర్ణిమ, చందు, చాందినీ, సుబ్బారావు, ఎస్‌వీఎస్‌ప్రసాద్, మనోహర్ తదితరులు వివిధ పాత కొత్త చిత్రాలలోని పాటలను రసరమ్యంగా గానం చేసి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. గుర్రం కృష్ణ నిర్వహణ సహకారాన్ని అందజేయగా, నరసింహ బృందం వాద్య సహకారాన్ని అందజేశారు.

వారంతా పేదింటి కుసుమాలైనా క్రీడావనంలో వికసిస్తున్నారు. ఒకవైపు చదువుకుంటూనే ఆటల్లో మేటిగా రాణిస్తున్నారు. క్రీడా పోటీల్లో అసాధారణ ప్రతిభను చాటుతూ ఔరా అనిపిస్తున్నారు. నైపుణ్యం, ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యాన్ని చూపుతూ క్రీడల్లో జాతీయ, రాష్ట్ర పోటీలకు ఎంపికై సత్తా చాటుతున్నారు. వీరే సింగరాయకొండ మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు. క్రీడా మైదానాల్లో అద్భుతాలు సృష్టిస్తున్న వారి గురించి 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- ఆంధ్రజ్యోతి, సింగరాయకొండ



ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి పోటీల్లో వివిధ క్రీడల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు

రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారుల తయారు కోసం కృషి



పాఠశాలలో క్రీడల్లో ఆసక్తి ఉన్న వారిని గుర్తించి ప్రత్యేకంగా క్రీడా పాఠాలు చెబుతున్నా. ఎక్కువగా వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇస్తున్నా. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు 40 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి, ఒకరు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. భవిష్యత్‌లో మరింత మంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తయారుచేయడమే నా లక్ష్యం.

- పిల్లి హజరత్తయ్య
పీఈటీ, పాకల జడ్పీ హైస్కూల్

క్రీడాకారులకు పుట్టినిల్లు పాకల



క్రీడాకారులకు పుట్టినిల్లు పాకల. అందులో జిల్లాలోనే ఈ గ్రామానికి ప్రత్యేక స్థానం ఉంది. గత మూడేళ్లలో స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెంట్ అవార్డును రెండుసార్లు మా హైస్కూల్ కైవసం చేసుకుంది. విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడంతోపాటు వారు క్రీడల్లో చూపుతున్న నైపుణ్యం గుర్తించి ప్రోత్సహిస్తున్నాం. రాష్ట్రంలో పాకల హైస్కూల్ స్థానాన్ని సుస్థిరం చేసే దిశగా విద్యార్థులకు శిక్షణ అందజేస్తున్నాం. ఎక్కువ మందిని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు పంపించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం.

- డీవీఎస్ ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు,
పాకల జడ్పీ హైస్కూల్

ఆటల్లో అదుర్స్!

సత్తాచాటుతున్న పాకల హైస్కూల్ విద్యార్థులు

- ఏడాదిలో 40 మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక
- మూడేళ్లలో రెండు సార్లు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెంట్ అవార్డు సొంతం
- జాతీయ స్థాయి కబడ్డీలో విద్యార్థిని సత్తా

జాతీయ కబడ్డీ పోటీల్లో సత్తాచాటిన సిపోరా



పాకల జడ్పీ పాఠశాలలో 10వ తరగతి అభ్యసిస్తున్న కె.సిపోరా కబడ్డీ పోటీల్లో మేటిగా రాణిస్తోంది. ఈఏడాది ఆగస్టులో రాష్ట్రస్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికై సత్తా చాటింది. ఇటీవల అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-17 బాలబాలికల కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపింది. ఆతరువాత జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈనెల 16వ తేదీ నుంచి 20 వరకూ మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొని తన ఆట తీరుతో అందరి మన్ననలు పొందింది. ప్రస్తుతం సీనియర్ నేషనల్ కబడ్డీ పోటీల్లో సత్తా చాటేందుకు ముందుకు సాగుతోంది. పోలీసు అధికారి కావాలన్నదే తన లక్ష్యమని చెప్తోంది.

అథ్లెటిక్స్‌లో అబ్బురపరుస్తున్న భార్గవ్



పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె.భార్గవ్ శ్రీకమల్ ఇటీవల జరిగిన స్కూల్‌గేమ్స్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాడు. జాతీయ స్థాయి పరుగుపందెం పోటీల్లో పాల్గొని గెలుపొందాలనే లక్ష్యంతో సాధన చేస్తున్నాడు. ఇండియన్ రైల్వేస్‌లో ఉద్యోగం సాధించాలనే తలంపుతో ముందుకు సాగుతున్నాడు.

రాష్ట్ర కబడ్డీ పోటీల్లో రాణిస్తున్న నందిని



పాఠశాలలో 9తరగతి చదువుతున్న కె.నందిని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీల్లో కూడా పాల్గొని సత్తా చాటింది. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో రాణించాలనే లక్ష్యంతో నిరంతరం సాధన చేస్తున్నది. వ్యాయామ ఉపాధ్యాయురాలిగా కొలువు సాధించాలన్నదే తన ఆశయమని ఆమె తెలిపింది.

వాలీబాల్‌లో ప్రశాంత్ వావ్..



పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వి.ప్రశాంత్ వాలీబాల్ పోటీల్లో అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నాడు. ఇటీవల నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొని సత్తా చాటాడు. అంతర్జాతీయ వాలీబాల్ జట్టుకు ఎంపిక కావాలన్న లక్ష్యంతో శ్రమిస్తున్నాడు. పోలీస్ ఆఫీసర్ కావాలన్నదే తన లక్ష్యమని ఆయన చెప్పారు.

రైతుకు రక్ష

- ఈ-పంట నమోదుతో భరోసా
- ప్రభుత్వ సాయంలో అదే ప్రామాణికం
- బీమా చెల్లింపులోనూ ప్రధానం
- ఖరీఫ్‌లో 98శాతం పూర్తి
- రబీ పంటల నమోదు ప్రారంభం
- ఈసారి ఖాళీ పొలాల వివరాలూ సేకరణ



త్రిపురాంతకం మండలంలో ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు (ఫైల్)

ఒంగోలు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయంలో ప్రస్తుతం ఈ-పంట నమోదు కీలకంగా మారింది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు, నష్ట పరిహారాలు, బీమా చెల్లింపుల్లోనూ ఈ-పంట నమోదునే ప్రామాణికంగా తీసుకుంటున్నారు. గతంలో అతివృష్టి, అనావృష్టి, వరదలు సంభవించినప్పుడు పంట నష్టపోయిన రైతుల వివరాలను గ్రామాల్లో రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది సేకరించి ప్రభుత్వానికి నివేదించేవారు. ఆ జాబితాలకు అనుగుణంగా సాయం అందించే వారు. అప్పట్లో బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు తీసుకొనే సమయంలో ఒక పంటను బ్యాంకులో చూపించి రుణం పొందడం, పొలంలో మరొక పంట వేయడం చేసేవారు. దానివల్ల నష్టపరిహారం అందకపోవడం, కొన్ని సందర్భాల్లో అసలు పంటసాగు చేయకుండా చేసినట్లు చూపి పరిహారం పొందడం వంటివి జరిగేవి. బీమా చెల్లింపు విషయంలో అయితే పంట సాగులో తేడాతో రైతులు నష్టపోయినా ఎక్కువ మందికి అందేది కాదు. వీటన్నింటికీ చెక్ పెడు తూ ప్రభుత్వం ఈ-పంట నమోదును తప్పని సరి చేసింది.

ఈ-పంట నమోదు ఇలా..

పంట సాగు అనంతరం వ్యవసాయశాఖ సిబ్బంది పొలాలకు వెళ్లి అందులో రైతును నిల్చోబెట్టి ఫొటో తీసి వ్యవసాయశాఖ ఇచ్చిన ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. రైతు అందుబాటులో లేని ఫొటోలు కూడా అప్‌లోడ్ చేస్తారు. తర్వాత వారి బయోమెట్రిక్ లేదా మొబైల్ ఫోన్ ఓటీపీతో ఈకేవైసీ కూడా చేస్తున్నారు. దీని ద్వారా రైతు, సర్వే నెంబరు వారీ ఏ పంట సాగు చేశారన్నది కంప్యూటర్‌లో నిక్షిప్తమవుతుంది. పంట నష్టాల సమయంలో వీటిని ప్రామాణికంగా తీసుకొని ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు, ఇతర ఉపకరణాలు, నష్టపరిహారం ఇస్తోంది. ఈనేపథ్యంలో ఈ-పంట నమోదు చేయించుకోని రైతులు నష్టపోయినా పరిహారం అందే అవకాశం లేకుండా పోయింది.

ఖరీఫ్‌లో 3.23లక్షల ఎకరాల నమోదు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 98 శాతానికి పైగా ఈ-పంట నమోదు చేశారు. ఖరీఫ్ సీజన్ సాధారణ సాగు విస్తీర్ణం 4.99 లక్షల ఎకరాలు కాగా సుమారు 4.01లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. అందులో 98శాతంతో ఇంచుమించు 3.23 లక్షల ఎకరాల వివరాలను ఈ-పంట యాప్‌లో పొందుపరిచారు. అందులో 87.80శాతం వివరాలను ఈకేవైసీ కూడా చేశారు. ఇక రబీ సీజన్ ఈ-పంట ప్రక్రియ ప్రస్తుతం ప్రారంభమైంది. మూడు రోజుల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా రబీ పంటల సాగు వివరాల నమోదుకు వ్యవసాయశాఖ ఈ-పంట యాప్‌ను ఆన్‌లైన్‌లో ఉంచింది. జిల్లావ్యాప్తంగా వ్యవసాయశాఖ సిబ్బంది ప్రక్రియను ప్రారంభించారు. మూడురోజుల క్రితం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏవో) శ్రీనివాసరావు త్రిపురాంతకం మండలంలో స్థానిక సిబ్బందితో కలిసి ఈ-పంట నమోదులో పాల్గొన్నారు. ఇతర అన్ని చోట్లా ప్రస్తుతం ప్రక్రియ కొనసాగుతోంది.

రబీలో 1.30లక్షల ఎకరాల్లో సాగు

రబీలో సాధారణ సాగు విస్తీర్ణం సుమారు 3.99 లక్షల ఎకరాలు కాగా ఇప్పటి వరకు సుమారు లక్షా 30 వేల ఎకరాల్లో పంటలు వేశారు. ఈ నెలాఖరు వరకూ పంటలు సాగవుతాయి. కొద్ది విస్తీర్ణంలో సంక్రాంతి వరకూ వేస్తారు. అప్పటి వరకూ ఈ-పంట నమోదు ప్రక్రియ కొనసాగనుంది. గతంలో కేవలం పంట సాగు చేసిన భూమినే నమోదు చేసేవారు. ఈసారి పంట వేయకుండా వదిలేసిన ఖాళీ భూముల వివరాలను కూడా యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. తద్వారా సాగు కాని భూమల వివరాలు కూడా స్పష్టంగా తెలియనున్నాయి.

హైమావతి హత్య కేసులో విచారణ

పలువురి కాల్ డేటా పరిశీలన ● దొరకని నిందితుల ఆచూకీ

టంగుటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరు పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో హత్యకు గురైన హైమావతి కేసులో నిందితులను కనుగొనేందుకు పోలీసులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఇప్పటి వరకు పూర్తిగా కాల్ డేటా మీదనే ఆధారపడి విచారణ చేశారు. ఈ హత్య ఉదంతం ఈనెల 26న వెలుగు చూసింది. చుట్టుపక్కల వారు చెప్పిన ఆధారాలను, మృతదేహం ఉన్న స్థితిని బట్టి ఈ నెల 24వ తేదీ రాత్రే హత్య జరిగి ఉంటుందన్న పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మృతురాలు, ఆమె భర్త, అనుమానితుల కాల్‌డేటాను పరిశీలిస్తున్నారు. ఆ పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. చుట్టుపక్కల గృహాలలోని కుటుంబాల వారిని పదేపదే విచారిస్తున్నారు. విచారణాధికారిగా సింగరాయకొండ సీఐ హజరత్తయ్య లోతైన దర్యాప్తు చేస్తున్నారు. వారం గడుస్తున్నా హత్య కేసులో నిందితులను గుర్తించడంలో జాప్యంపై రకరకాల విమర్శలు వినిపిస్తున్నాయి.

కోడి పందేలు వేస్తున్న 14 మంది అరెస్టు

మేదరమెట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండలం పమిడిపాడులో కోడిపందేలు వేస్తున్న 14 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు ఆదేశాల మేరకు కొరిశపాడు ఎస్‌ఐ సురేష్, మేదరమెట్ల ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ సిబ్బందితో కలిసి కోడిపందేలు వేస్తున్న స్థావరంపై దాడి చేశారు. పోలీసులు చూసి కొంతమంది కోళ్లతో సహా పొలాల్లోకి పారిపోయారు. మొత్తం 14 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోళ్లు, 8 కత్తులు, రూ.18070 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా రూరల్ సీఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ అద్దంకి రూరల్ సర్కిల్‌లో కోడిపందెలు, పేకాట, గంజాయి అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేశారు.

మహాభారతంలోని పాత్రలపై అవగాహన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జ్యోతి చంద్రమౌళి

అద్దంకిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహాభారతంలోని పాత్రల గురించి మెరుగైన అవగాహనను ఈ మహాభారతం జాతీయాలు, సంఘటనలు పుస్తకం కలుగచేస్తుందని శాసన పరిశోధకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి అన్నారు. ఆదివారం అద్దంకిలో మారం వారి సేవాసదన్‌లో సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో లక్కరాజు శ్రీనివాసరావు రచించిన మహాభారతం, జాతీయాలు, సంఘటనలు పుస్తకావిష్కరణ సభ లక్కరాజు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పుస్తకాన్ని జ్యోతి చంద్రమౌళి ఆవిష్కరించారు. పలువురు వక్తలు మాట్లాడారు. చాలా మందికి తెలియని అనేక అజ్ఞాత అంశాలను రచయిత వెలికితీసి ఆశ్చర్యాన్ని కలుగజేశారని శివరామప్రసాద్ అన్నారు. మహాభారతం ప్రపంచానికి దిక్సూచి అని ఆర్‌వీ.రాఘవరావు పేర్కొన్నారు. అనంతరం సభ్యులు రచయితను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దివాకర్‌దత్తు, చందలూరి నారాయణరావు, అన్నమనేని వెంకట్రావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, బాలసుబ్రహ్మణ్యం, దేవపాలన, రామదాసు, కోటయ్య, రాఘురామశర్మ పాల్గొన్నారు.

జీసీటీఏ జిల్లా నూతన కమిటీ

అద్దంకిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) నూతన కమిటీని ఆదివారం బాపట్ల జిల్లా మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా షేక్ కలాం (బాపట్ల) వ్యవహించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా నూతన అధ్యక్షుడిగా అద్దంకిలోని కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు మహమ్మద్ నయీం, కార్యదర్శిగా అశోక్‌కుమార్, సెక్రటరీగా చిలక అనిత, కోశాధికారిగా రేపల్లె కళాశాలకు చెందిన డి.సంపూర్ణరావును ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులు సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కలాం కోరారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, సంఘ సభ్యులు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సుబ్బరామరెడ్డి వర్ధంతి

నివాళులర్పించిన ఎంపీ మాగుంట, మంత్రి స్వామి, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు



సుబ్బరామరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, అతిథులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యుడు మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి వేడుకలు జిల్లాకేంద్రమైన ఒంగోలులో ఘనంగా జరిగాయి. ముందుగా స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయులు రాఘవరెడ్డి, నిఖిల్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నెల్లూరుబస్టాండు, రైల్వేస్టేషన్‌రోడ్డు, అద్దంకి బస్టాండులోని సుబ్బరామరెడ్డి కాంశ్య విగ్రహాలతోపాటు అభిమానులు ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమాల్లో మాగుంట పాల్గొన్నారు. అనంతరం పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సంతాప సభతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంతాప సభలో మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, బీఎన్.విజయకుమార్, ఎంఎం.కొండయ్య, దర్శి, వైపాలెం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, గుడూరి ఎరిక్షన్‌బాబు, ఎస్పీ దామోదర్, మాజీ ఎమ్మెల్యేలు దివి శివరాం, బాచినచెంచు గరటయ్య, ఈదర హరిబాబు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, బీజేపీ, జనసేన పార్టీల అధ్యక్షులు పీవీ.శివారెడ్డి, షేక్ రియాజ్ తదితరులు సుబ్బరామరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ మాగుంట సుబ్బరామరెడ్డి ప్రజల మనిషి అని, ఒంగోలు ఎంపీగా ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. రాజకీయ, వ్యాపార రంగాల్లో మాగుంట కుటుంబం తనదైన ముద్ర వేసుకుందన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు స్థాపించి వేలాది మందికి ఉపాధి కల్పించారని కొనియాడారు. కాగా ముందుగా సర్వమత ప్రార్థనలు చేశారు. రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు వెంకటశ్రీనివాసులు ఆధ్వర్యంలో కవిసమ్మేళనం, చల్లా నాగేశ్వరమ్మ బృందం అన్నమయ్య, ఆధ్యాత్మిక గీతాల ఆలాపన ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం పోలీసు బ్యాండుతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాగుంట కాలేజీల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్లను మంత్రి స్వామి, ఇతర ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో చిన్నఓబులేషు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, కమిషనర్ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, టీడీపీ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, తాతా ప్రసాద్, బెల్లం సత్యనారాయణ, రంగసాయి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమానికి పలు ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు.

ముగిసిన కార్తీక మాసం

నేడు పోలి పాడ్యమి ● నీటిలో దీపాలు వదలనున్న మహిళలు



సంతనూతలపాడు సుబ్రహ్మణ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): శివుని ఆరాధనకు అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్తీకమాసం ఆదివారంతో ముగిసింది. సోమవారం నుంచి మార్గశిర మాసం ప్రారంభం అవుతున్నది. ఇక కార్తీకమాసం నెలరోజులు జిల్లావ్యాప్తంగా పలు శివాలయాలలో పరమేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు కొనసాగాయి. అదేవిధంగా కార్తీక సోమవారాలు మహిళలు పెద్దసంఖ్యలో శివాలయాలకు చేరుకుని దీపాలు వెలిగించి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇక కార్తీకమాసంలో సముద్రస్నానానికి విశిష్టమైన రోజుగా చెప్పబడే పౌర్ణమి రోజున జిల్లావ్యాప్తంగా వేలాదిమంది సముద్రస్నానాలు ఆచరించారు. కార్తీకమాసం ముగిసి మార్గశిర మాసం ప్రారంభం రోజు అంటే పాడ్యమిని పోలి పాడ్యమిగా జరుపుకోవటం ఆనవాయితీ. ఆ రోజున తెల్లవారుజామునే మహిళలు అరటి దొన్నెలలో వత్తులు వెలిగించి స్థానికంగా ఉన్న చెరువులు, బావులలో వదులుతారు. కార్తీకమాసం నెలరోజులు ఎన్ని అవాంతరాలు వచ్చినప్పటికీ, అత్త, ఆడపడుచులు ఎంతగా వారించినప్పటికీ అనన్యమైన భక్తితో పరమేశ్వరుని పూజించిన పోలి అనే మహిళ భక్తికి మెచ్చి ఆమెకు స్వర్గలోక ప్రాప్తిని ఈ పాడ్యమి రోజునే దేవతలు కలిగించారని , అందువల్లనే దీనిని పోలి స్వర్గం అని కూడా పిలుస్తారు. ఈ రోజున మహిళలు 30వత్తులను వెలిగించటం వల్ల కార్తీకమాసం మొత్తం దీపారాధన చేసిన ఫలితం వస్తుందని చెప్తారు. ఈ సంవత్సరం పోలిపాడ్యమి శివుని ఆరాధనకు ఎంతో విశిష్టమైన సోమవారం రావటం కూడా విశేషం.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

టంగుటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని చిరునామా తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన టంగుటూరు మండలంలోని జాతీయరహదారిలో గల బాపూజీకాలనీ ఎదురుగా ఒంగోలు-నెల్లూరు రోడ్డులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఆదివారం సాయంత్రం వరకు కూడా మృతదేహం ఎవరిది అనేది తెలియరాలేదు. మృతుడికి 40ఏళ్ల లోపు వయస్సు ఉంటుంది. శరీరంపై గోధుమ రంగు ప్యాంటు, ఎరుపు, నలుపురంగు జర్కిన్ ధరించి ఉన్నాడు. మృతుని సమాచారం తెలిసిన వారు ఫోన్ చేయాలని ఎస్సై కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టుకు గాయాలు

మద్దిపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం గుండ్లాపల్లి పరిశ్రమ కేంద్రం వద్ద ఆదివారం మోటార్‌సైకిల్ అదుపు తప్పి యువకునికి గాయాలయ్యాయి. మార్టూరుకు చెందిన జయరామ్‌రెడ్డి తన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కిందపడిపోయాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం మేదరమెట్లకు తరలించారు.

40 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన రేషన్ బియ్యం

మార్కాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ-2లోని ఓ గృహంలో అక్రమంగా నిల్వ ఉంచిన 40 బస్తాల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే, స్థానిక పూలసుబ్బయ్య కాలనీ నుంచి రేషన్ బియ్యం తరలిపోతున్నట్లు రెవెన్యూ అధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్వో రామ కోటేశ్వరరావులు పూలసుబ్బయ్య కాలనీ, ఇందిరమ్మ కాలనీ-2లలో సోదాలు నిర్వహించారు. ఇందిరమ్మ కాలనీలోని ఓ గృహంలో ప్లాస్టిక్ గోతాలలో సుమారు 40 బస్తాల్లో బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాటిని పరిశీలించి పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. 11వ రేషన్ దుకాణానికి వాటిని తరలించారు. ఈ రేషన్ బియ్యం ఎక్కడి నుంచి తరలించారు. ఎవరు అక్కడకు చేర్చారు అనే విషయంపై అధికారులు విచారిస్తున్నారు.

ఈ నీటి వృథాకు బాధ్యులెవరు..?



వృథాగా పోతున్న నీరు

కంభం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కంభం పట్టణం వై.జంక్షన్‌లో ప్రధాన రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన పబ్లిక్ కొళాయి నుంచి నీరు పైకి ఎగజిమ్ముతూ వృథాగా పోతోంది. దీనిగురించి పంచాయతీ సిబ్బంది పట్టించుకోపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కంభం మండలంలోని పలు పంచాయతీలలో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఈ విధంగా ఉన్న నీటి వనరులను అధికారులు వృథా చేస్తుంటే భవిష్యత్తులో ఈ ప్రాంతం కూడా నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి వస్తోంది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి నీటి కొళాయిలను మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

చట్టుతాండా పొలాల్లో కొండచిలువ కలకలం

● పట్టుకొని అడవిలో వదిలేసిన స్నేక్ క్యాచర్



కొండచిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్

పెద్దదోర్నాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చట్టుతాండా వ్యవసాయ పొలాల్లో కొండచిలువ ఆదివారం కలకలం రేపింది. నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న చట్టుతాండా గ్రామం పంట పొలాల్లో రైతులకు కొండచిలువ కనిపించింది. దీంతో రైతులు హడలెత్తిపోయారు. వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. స్పందించిన అటవీ శాఖధికారులు స్నేక్ క్యాచర్ నిరంజన్‌ను పిలిపించారు. ఆయన చాకిచక్యంగా పామును పట్టుకొని లోతట్టు అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టాడు.

సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారుల దాడి

● 200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

పుల్లలచెరువు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో కాపుకాస్తున్న నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. ఆదివారం ఎక్సైజ్ ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని చిన్న పీఆర్‌సీ తాండ సమీపంలోని అటవీ ప్రాంతంలో బట్టీలపై దాడులు చేశారు. సారా కోసం నిల్వ వుంచిన 200 వందల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ సీహెచ్.శ్రీనివాసులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాల పంపిణీ



ధ్రువపత్రాలతో విద్యార్థులు

గిద్దలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అల్‌మదాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉర్దూ, అరబిక్ కోర్సులను ముస్లిం విద్యార్థులు పూర్తి చేశారు. కోర్సులు పూర్తి చేసిన ముస్లిం విద్యార్థులకు షాదీఖానా ఆవరణలో ఆదివారం కోర్సు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. రెండేళ్లుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక సంవత్సరం ఉర్దూ, అరబిక్ భాషల కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఉర్దూ భాష అన్నది కేవలం ముస్లింల భాష మాత్రమే కాదు భారతీయ భాషల్లో ఒక భాష అని ఫౌండేషన్ చైర్మన్ రహీం పేర్కొన్నారు. 25 శాతం ముస్లిం విద్యార్థులున్న ప్రతి పాఠశాలలో ఉర్దూ టీచర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిలాల్ మసీద్ ఇమామ్ మౌలానా అబ్దుల్ రషీద్, ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుడిసె మహబూబ్‌భాషా, షాదీఖానా అధ్యక్షులు మున్సిపల్ కౌన్సిలర్ పఠాన్ ఖాదర్‌ఖాన్, ఉర్దూ టీచర్లు తదితరులు పాల్గొని కోర్సు పూర్తి చేసిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

ఘనంగా టిప్పుసుల్తాన్ జయంతి



కేక్ కట్ చేస్తున్న ముస్లిం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ వారిని ఎదిరించి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న టిప్పుసుల్తాన్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మార్కాపురం ముస్లిం యువత ఆధ్వర్యంలో టిప్పు సుల్తాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం యువత నాయకులు మాట్లాడుతూ, టిప్పుసుల్తాన్ వీరత్వం యువత గుండెల్లో నింపుకోవాలని, ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జాతి, కులమతాలకు అతీతంగా టిప్పుసుల్తాన్ పాలనను అందించాడన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ మౌలాలి, పఠాన్ ఇబ్రహీంఖాన్, నాగూర్‌వలి, మైనార్టీ నాయకులు షేక్ కాలీద్, షేక్ అల్లీ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిలువెత్తు రూపం

● విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా అల్లుకున్న చిల్లకంప ● సరఫరాలో తరచూ ఆటంకంతో ప్రజల అవస్థలు



కొత్తపల్లి రోడ్డులో స్తంభాలకు అల్లుకున్న చిల్లకంప

ఎర్రగొండపాలెంరూరల్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పట్టణంలోని కొత్తపల్లి, పుల్లలచెరువు రోడ్డులో విద్యుత్ స్తంభాలకు చెట్లు అల్లుకున్నాయి.



పుల్లలచెరువు రోడ్డులో స్తంభాలను చుట్టేసిన చెట్లతీగలు

దీంతో ఆయా ప్రాంతాలలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో పాటు అప్పుడప్పుడు మంటలు వస్తున్నాయి స్థానికులు ఆందోళన చెంతున్నారు.

తరచూ అంతరాయం..

విద్యుత్ స్తంభాలకు తీగచెట్లు అల్లుకోవడం ఒక సమస్య అయితే నాణ్యత లోపించిన విద్యుత్ తీగలు ఉండడం మరో సమస్య. దీంతో తరచూ పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యపై పలుమార్లు ప్రజలు విద్యుత్ శాఖ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. తరచూ విద్యుత్ అంతరాయాలతో గృహాలలోని విద్యుత్ సామగ్రి మరమ్మతులకు గురవుతోందని ప్రజలు వాపోతున్నారు. అలాగే పట్టణంలో గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ తీగలు కిందకు వేళాడుతున్నాయి. ప్రధాన రహదారి వెంబడి కూడా ఈ సమస్య ఉంది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగక ముందే సమస్యను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు ఉన్నా, స్పందన కరువు

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో రైతులకు, విద్యుత్ వినియోగదారులకు ఏదైన సమస్య వచ్చినా, చెప్పేందుకు కార్యలయంలోనూ, ఫోన్‌లోనూ, సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని ప్రజలు వాపోతున్నారు. మేజరు సమస్యలను చెప్పిన పట్టించుకునే సిబ్బంది అందు బాటులో ఉండరని సిబ్బందిపై ఆరోపణలు చాలా ఉన్నాయి. చిన్నపాటి గాలులకు, వర్షానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని అలాంటి సమస్యలు లేకుండా సిబ్బంది అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. అలాగే నాణ్యమైన విద్యుత్ అందించి ప్రజల కష్టాలను తొలగించాలని కోరుతున్నారు.

గుభాళించని బంతిపూలు

ఆశించిన ధరలు లేక రైతులు విలవిల



మచ్చవచ్చిన బంతిపూలను చూపుతున్న రైతు

పొదిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బంతి పూల తోటలు సాగుచేసిన రైతులు ఆశలు అడియాశలుగానే మిగిలిపోయాయి. ఈ ఏడాది మంచి దిగుబడులు వచ్చి ధరలు ఆశాజనకంగా ఉంటాయని రైతులు ఆశపడ్డారు. అనుకోకుండా అక్టోబరు నెలలో కురిసిన వర్షాలకు పూలపై మచ్చలు వచ్చి దెబ్బతిన్నాయి. దీంతో ధరలు అంతంత మాత్రంగా ఉన్నాయని రైతు రమేష్ తెలిపారు. అంతేకాకుండా పూలకు మచ్చరావడంతో వ్యాపారులు కొనుగోలుకు ముందుకు రావడం లేదన్నారు. అన్ని సక్రమంగా ఉంటేనే వ్యాపారులు ఏదోఒక సాకుతో ధరలు తగ్గిస్తారని ప్రస్తుతం మచ్చ రావడంతో, పూలసైజు తగ్గడంతో వ్యాపారులు కొనడం మానేశారిన వాపోయారు. పూలుకోయించి రైతులు స్వయంగా మార్కెట్‌కు తీసుకెళ్లినా, ఆశించిన ధరలు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఏడాది 1.50 ఎకరాల్లో సాగు చేశా

ఈ ఏడాది 1.50 ఎకరాల్లో బంతిపూలు సాగు చేశా. రూ.లక్ష పెట్టుబడి పెడితే రూ.60 వేల నుంచి రూ.70 వేలు మాత్రమే దిగుబడి వచ్చింది. కూలీలు ఖర్చులు మాత్రం అమాంతంగా పెరిగాయి. దిగుబడి బాగా ఉండి పూలసైజు బాగా ఉంటే సుమారుగా పది కోతల పూలు తెగాలి. అయితే ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. అయితే అదృష్టం కొద్ది లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు పూలు వినియోగించడంతో నష్టాలు లేకుండా బయటపడ్డాం.

రమేష్, బంతిపూలసాగు రైతు

కార్మికులకు దుప్పట్ల పంపిణీ



పంచాయతీ కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేసిన సేవా సంస్థ సభ్యులు

పెద్దదోర్నాల, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): దోర్నాలలోని సత్యసాయిబాబా మందిరంలో పంచాయతీ కార్మికులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. సత్యసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి శివకోటేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షులు టీ రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు కిరణ్ కిశోర్ కుమార్, సభ్యులు వెంకట రమణా రెడ్డి, మొగిలిగుప్తా పాల్గొన్నారు.

దాతల సహాయంతో అంత్యక్రియలు

గిద్దలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవిని అనాథాశ్రమంలో మృతిచెందిన వృద్ధుడికి దాతలు విరాళాలు వేసుకుని అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. బి.కోడూరు మండలం చెన్నారెడ్డిపేటకు చెందిన కె.దుగ్గిరెడ్డి(85) వృద్ధుడు అనాథశ్రమంలో ఆశ్రయం పొంది అనారోగ్యంతో మృతిచెందాడు. కుటుంబసభ్యులు ఎవరూ లేకపోవడంతో దాతలు ముందుకు వచ్చి సాంప్రదాయబద్ధంగా ఆ వృద్ధుడికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు రాజశేఖర్, దివ్యహెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు శరత్‌బాబు, ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా గురువు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థకు ఏసీ ఫ్రీజర్ బాక్స్ అందజేత



ఫ్రీజర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 1986-87 పూర్వ విద్యార్థులు మానవత స్వచ్ఛంద సంస్థకు ఏసీ ఫ్రీజర్ బాక్సును బహుకరించారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంధ సంస్థకు బాక్సును అందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి అన్నా రాములు మాట్లాడుతూ.. తమ సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం ప్రారంభం



చద్ది స్వీకరిస్తున్న అయ్యప్ప భక్తులు

పెద్దదోర్నాల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ హరిహరపుత్ర దేవాలయంలో అయ్యప్ప భక్తులకు ఉచిత అన్నదానం కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్నదానాన్ని దోర్నాల పంచాయతీ కార్యదర్శి శివకోటేశ్వరరావు, రేంజి అధికారి జీవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు బొగ్గరపు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణం జరిగినప్పటి నుంచి ఏటా డిసెంబరు 1వ తేదీ నుంచి జనవరి 12వ తేదీ వరకు అయ్యప్ప మాలధారులు, భక్తులకు ఉచితంగా అన్నసంతర్పణ చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక దాతలతో పాటు దేశంలోని నలుమూలల నుంచి శ్రీశైలం పుణ్య క్షేత్రానికి భక్తులు దాతల సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గురుస్వాములు సాంబయ్య, కానిస్టేబుల్ మోహన్, ఆలయ పెద్దలు బొగ్గరపు రమేష్, బండారు సుబ్బనారాయణ, రావికింది పాండు, చింతలచెర్వు మల్లికార్జున రెడ్డి, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది

కంభం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎయిడ్స్ నివారణపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఏటా డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ డే చేస్తున్నట్లుగా కంభం ప్రభుత్వ వైద్యశాల ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీకృష్ణ తెలిపారు. ఎయిడ్స్‌డే సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వంశీక్రిష్ణ మాట్లాడుతూ హెచ్‌ఐవీ రోగుల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్ 2వ స్థానంలో ఉందన్నారు. వీరిలో మహిళలే అత్యధికమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌చంద్ర, డాక్టర్ శివనాయక్ పాల్గొన్నారు.

5న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

సంతనూతలపాడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు జడ్పీ హైస్కూల్లో ఈనెల5న జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీపోటీలు ఘనంగా ప్రారంభం కానున్నట్లు కబడ్డీ అసోసియేషన్ నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను నూదనగుంటకృష్ణమూర్తి, అసోసియేషన్ ప్రెసిడెంట్ కుర్రా బాస్కరరావు, ఉపాధ్యక్షులు ఎస్.రంగారావు, రమేష్, పీడీలు పరిశీలించారు. పోటీలను ప్రముఖులచే ఘనంగా ప్రారంభిస్తారని, గత 32 ఏళ్ల క్రితం జిల్లాలో చినపవనిలో జరిగాయని, ప్రస్తుతం ఇక్కడ జరగబోతున్నట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

సివిల్ సప్లై గూడౌన్‌లో తనిఖీ



సరుకులను పరిశీలిస్తున్న డీఎస్‌వో

ఎర్రగొండపాలెం రూరల్ డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వినుకొండ రోడ్డులోని సివిల్ సప్లై గూడాన్ని జిల్లా సివిల్ సప్లై అధికారిని పద్మశ్రీ ఆదివారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. నెలవారి తనిఖీలలో భాగంగా వచ్చినట్లు ఆమె తెలిపారు. సివిల్ సప్లైలోని స్టాక్ పాయింట్‌ను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులకు సంబందించి స్టాకుకు ఏదైనా తేడా ఉన్న విషయాన్ని పరిశీలించారు. డీలర్లుకు, అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించిన నిత్యవసర సరుకులు క్రమం తప్పకుండా డెలవరి చేయాలని అన్నారు. ఆమె వెంట డీటీ బ్రమరాంబ, సిబ్బంది ఉన్నారు.

గంగమ్మ, గౌరమ్మలకు పూజలు

ముగిసిన నిమజ్జనం, భక్తులకు వన భోజనాలు



గంగమ్మ గౌరమ్మలకు పూజలు చేస్తున్న భక్తులు

గిద్దలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస పూజల్లో భాగంగా చివరి రోజు ఆదివారం పట్టణంలోని అమ్మవారిశాలలో గంగమ్మ, గౌరమ్మల పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళ భక్తులు నెలరోజులపాటు గంగమ్మ, గౌరమ్మలకు కుంకుమ పూజలు నిర్వహించి ఆదివారం సామూహికంగా పూజల అనంతరం సగిలేరు నదిలో నిమజ్జనం చేశారు. అనంతరం భీమలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆర్యవైశ్య కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు వెయ్యిమంది ఆర్యవైశ్యులు కార్తీక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, కమిటీ ప్రతినిధులు జిలకర సత్యం, దమ్మాల జనార్ధన్, ముప్పూరి చంటి, వాడకట్టు శివప్రసాద్, నటుకుల శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్ష



తర్లుపాడులో పరీక్షాపత్రాలు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

తర్లుపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్షను డివిజన్ స్థాయిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్ఎండీ రఫీ తెలిపారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ.. పాఠశాలలో ఈ పరీక్షలో ప్రతిభ సాధించిన వారు కేంద్ర ప్రభుత్వం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైతే నాలుగేళ్ల పాటు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున ప్రొత్సాహం అందుతుందన్నారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే పోటీ పరీక్షలకు సంసిద్ధమై రాణిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోటిమోహన్, వినోద్, మౌలాలి, మల్లికార్జునరావు, రామాంజనేయరెడ్డి, శీను తదితరులు పాల్గొన్నారు.



మార్కాపురంలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ నాయకులు, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి పరీక్షా పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కోటి మోహన్, రఫీ, వెంకటేశ్వరరెడ్డి, యూసుఫ్ షరీఫ్, వినోద్, మౌలాలి, విజయసారధి, శివ ప్రసాద్, బాస్కర్‌రెడ్డి, సత్యరమేష్, రామాంజనేయరెడ్డి, షుకూర్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు



భోజనాల వడ్డిస్తున్న కృష్ణకిషోర్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని కే.ఎస్.పల్లె గ్రామసమీపంలోని శ్రీ ఎగువ భీమలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద కార్తీక వన భోజనాలు నిర్వహించారు. వన భోజనాలను టీడీపీ నేత ముత్తుముల కృష్ణకిశోర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఆలయ కమిటీ సభ్యులు క్రిష్ణకిశోర్‌రెడ్డిని పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నంద్యాల శ్రీనివాసులు, చల్లా బాలునరసింహులు, ఒ.వెంకటయ్య, బోదనబోయిన గోపాలక్రిష్ణ, చల్లా రమేష్, బూనబోయిన చంద్రశేఖర్, దారం గురువయ్య, మొర్రి పిచ్చయ్య, కొత్తకోట పోలయ్య, బాలగురువయ్య, బొర్రా రాఘవేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జగదాంబకు అమావాస్య పూజలు





ప్రత్యేక అలంకరణలో జగదాంబ, పూజలు చేస్తున్న మహిళలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్య పురస్కరించు కుని స్థానిక మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబకు సహస్ర నిమ్మార్చన నిర్వహించారు. ఉదయం అర్చకులు వరుణ్‌తేజశర్మ అమ్మవారికి అభిషేకాలు, అర్చన నిర్వహించి 1116 నిమ్మకాయలను కుంకుమార్చన నిర్వహించారు. మార్కండేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు. టీడీపీ యువ నాయకులు కందుల రోహిత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆధ్వర్యంలో ఆలయంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.



పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు రోహిత్‌రెడ్డి

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణ శివారులలో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భృగమల్లేశ్వరస్వామి ఆలయంలో శివనామస్మరణ

గిద్దలూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలం అనుమలవీడులోని భృగమల్లేశ్వరస్వామి శివాలయంలో 24 గంటల పాటు శివనామస్మరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. కార్తీక మాస చివరిరోజు కావడంతో శివనామస్మరణ, మంత్రజప కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు, నగర సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధర్మకర్త పిడతల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

ముఖాముఖి

కార్పొరేటుకు దీటుగా విద్యాబోధన

ఆర్.శ్రీనివాస్, ఎంఈవో, పీసీపల్లి



ప్రశ్న: ప్రభుత్వ పాఠశాలల భవనాలు అధ్వానంగా ఉన్నాయి కదా?

జవాబు: నాడు-నేడులో మంజూరుకాని నేరేడుపల్లి(ఎస్సీ), లక్ష్మక్కపల్లి, గోపవరపువారిపల్లి, శంకరాపురం పాఠశాలలు కొంత మేర అధ్వానంగా ఉన్నాయి. వాటి స్థానంలో నూతన తరగతి గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించాం.

ప్ర: పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందా?

జ: మండలంలో నాలుగు ఎస్‌జీటీ పోస్టుల కొరత ఉంది. మూలెవారిపల్లి, అడవిలోపల్లి, వెంగళాయపల్లి, పీసీపల్లి పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ఖాళీల భర్తీ కోసం డీఈవో దృష్టికి తీసుకెళ్లాం.

ప్ర: మండలంలో ప్రైవేటు పాఠశాలలకు గుర్తింపు ఉందా?

జ: మండలంలో రెండు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వాటి గుర్తింపు రెన్యువల్ కోసం యాజమాన్యాలు డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు.

ప్ర: మధ్యాహ్న భోజనంలో రాజకీయ జోక్యం ఉందా?

జ: ఎటువంటి రాజకీయ జోక్యం లేదు. ఇటీవల కొన్నిచోట్ల ఎండీఎం నిర్వాహకులు వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. వారి స్థానాల్లో మండల కమిటీ ద్వారా కొత్తవారిని నియమించాం.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న తూర్పుగంగవరం పంచాయతీ సోమవర్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగాభవానీ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరు ణించమని వేడుకున్నారు. తాళ్లూరు ప్రాంతంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావటంతో సందడిగా మారింది. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌రావు, బాలరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు

ముండ్లమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని బస్టాండ్ సెంటర్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి, సాయిబాబా గుడి వరకు ప్రధాన వీధుల్లో రెండు నెలల నుంచి వీధి లైట్లు వెలగడంలేదు. ఈ రెండు ప్రధాన వీధుల్లో నెలకొన్న అంధకారంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టించు కోవాల్సిన పంచాయతీ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. రాత్రుల సమయంలో ఆ వీధిల్లోకి వెళితే ఏప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయ పడుతున్నారు.

ప్రధానంగా అద్దంకి - దర్శి ప్రధాన రహదారి కావటంతో నిత్యం వాహనాలు వెళుతుంటాయి. అంబేడ్కర్ నగర్, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, ప్రభుత్వ ఆస్పత్రి కూడా ఈ ప్రధాన రహదారి పక్కనే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు నిర్వహించారు. వివిధప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె.చినఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహాబాబు, తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లకు దరఖాస్తు చేసుకోవాలి

పీసీపల్లి, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన వితంతువులు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ప్రభాకరశర్మ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మండలంలో వృద్ధాప్య పింఛన్ పొందుతున్న వారు ఎవరైనా మరణిస్తే వారి భాగస్వామి అయిన భార్య వితంతు పింఛన్‌కు అర్హురాలని తెలిపారు. అటువంటి వారు ఎవరైనాఉంటే భర్త డెత్ సర్టిఫికెట్ తీసుకుని ఇతర ఆధారాలతో సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అమృత్ పథకం అమలుకు శ్రీకారం

- దర్శికి రూ.121 కోట్లు మంజూరు
- ఇంటింటికీ కొళాయి ఏర్పాటుకు సన్నాహాలు



దర్శి పట్టణ వ్యూ

దర్శి డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తీర్చేందుకు అమృత్ పథకం అమలుకు అధికారులు శ్రీకారం చుట్టారు. రెండేళ్ల క్రితం దర్శి నగర పంచాయతీలో ఇంటింటికి కొళాయి పథకం అమలు చేసేందుకు కేంద్రప్రభుత్వం అమృత్ పథకం కింద రూ.121 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అప్పటి వైసీపీ పాలకులు టెండర్లు పిలిచి వదిలేశారు. పనుల నిర్వాహణ గురించి పట్టించుకోలేదు. ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు. కొద్దిరోజుల క్రితం ఇంటింటికి కొళాయి పథకం ఏర్పాటును ఆమోదిస్తూ నగర పంచాయతీ తీర్మానం చేసింది. ప్రజారోగ్యశాఖ అధికారులు రెండురోజుల క్రితం పథకం అమలుకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించారు. ముండ్లమూరు మండలం పులిపాడు చెరువును మంచినీటి చెరువుగా మార్చి సాగర్ జలాలను నింపుతారు. గ్రావిటీ మీద చెరువుకు నీరు నింపే అవకాశం ఉంది. దీంతో ఆ చెరువును ఎంపిక చేశారు. అక్కడే ఫిల్టర్‌బెడ్లు ఏర్పాటుచేసి నీటిని శుద్ధిచేసి దర్శి పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

దర్శి పట్టణంలోని 9వేల కుటుంబాలకు ఈపథకం కింద కొళాయిలు ఏర్పాటుచేస్తారు. ఈ పథకం నిర్మాణం రెండేళ్ల లోపు పూర్తిచేసే విధంగా నిర్దేశించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చొరవతో ఈపథకం అమలుకు అధికారులు శ్రీకారం పలికారు. వీలైనంత త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

డంపింగ్ యార్డులా సాగర్ కాలువ

- వ్యర్థాలన్నీ కట్టపైనే
- వర్షం కురిస్తే కాలువలోకి..
- పట్టించుకోని ఎన్నెస్పీ అధికారులు



దర్శి బ్రాంచి కాలువపై వేసిన చెత్త

కురిచేడు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువ డంపింగ్ యార్డును తలపిస్తున్నది. కురిచేడు పక్కనే ఉన్న దర్శి బ్రాంచి కాలువ కట్టపై గ్రామంలోని వ్యర్థాలను పారవేస్తున్నారు. వర్షం కురిస్తే వ్యర్థాలన్నీ కాలువలోకి చేరడంతో నీరు కలుషితమవుతుంది. ఇంత జరుగుతున్నా ఎన్నెస్పీ అధికారులు తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు.

కురిచేడును ఆనుకుని దర్శి బ్రాంచి కాలువ ఉంది. ప్రపంచ బ్యాంకు నిధులతో గతంలో కాలువ కట్టలను బలపరచారు. అనంతరం ఎవరూ పట్టించుకోకపోవడంతో కట్టలపై చిల్లచెట్లు మొలచి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇదేఅదనుగా కొంతమంది కాలువ కట్టపై గృహాల వ్యర్థాలను పడవేస్తున్నారు. చికెన్ కొట్లవారు వ్యర్థాలను సైతం కాలువ కట్టమీదనే వేస్తున్నారు. మరికొంతమంది కట్టపైనే కార్యక్రమాలు ముగిస్తున్నారు. ఎన్నెస్పీ అధికారులు ఇవేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కనీసం కట్టపై రాకపోకలకు ఇబ్బందిగా ఉందనే విషయాన్ని కూడా వారు పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. వర్షం కురిసినప్పుడు కాలువ కట్టపై ఉన్న వ్యర్థాలన్నీ కాలువలోకి వెళ్ళిపోతున్నాయి. దీంతో కాలువలోని నీరు కలుషితమవుతుంది. ఈ కాలువమీదనే కురిచేడు, దర్శితో పాటు కనిగిరి, ఒంగోలుకు చెందిన మంచినీటి పథకాలు ఉన్నాయి. దీంతో ప్రజలు కలుషిత నీరు తాగే దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా ఎన్నెస్పీ అధికారులు దృష్టి సారించి కాలువ కట్టపై వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

నడి రోడ్డుపై గోతులు

- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు
- తరచూ ప్రమాదాలు
- చోద్యం చూస్తున్న ఆర్‌అండ్‌బీ అధికారులు



బొప్పూడివారిపాలెం - ఈదర ఆర్‌అండ్‌బీ రహదారిపై పడిన గొయ్యి

ముండ్లమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదర నుంచి బొప్పూడివారిపాలెం వెళ్ళే ఆర్‌అండ్‌బీ రహదారి మధ్యలో నేల చప్టా సమీపంలో గోతులు పడటంతో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. గోతులు పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అద్దంకి నుంచి వినుకొండ వెళ్ళే ప్రధాన రహదారి కావటంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి.

ఈ రహదారిపై రెండు పెద్ద గోతులు పడటంతో ఆర్‌అంబీ అధికారులకు కనీసం పూడ్చాలన్న ఆలోచన కూడా రాకపోవటంపై ప్రజలు విమర్శిస్తున్నారు. రాత్రుల సమయాల్లో వాహన చోదకులు గోతుల్లోపడి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై పడిన గోతులను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సంక్షేమ పథకాల అమలులో కనిగిరికి ప్రాధాన్యమివ్వాలి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, మైనారిటీ నాయకులు

కనిగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మైనారిటీ సంక్షేమ పథకాల అమలులో కనిగిరి ప్రాంతానికి అధిక ప్రాధాన్యతనిచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను కోరారు. ఈనెల 9 మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా ముస్తాక్ అహ్మద్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఈకార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర మౌలానాకు అభినందనలు తెలిపి ఘనంగా సత్కరించారు. కనిగిరి ప్రాంతంలో ముస్లింల జీవన స్థితిగతులు, ఆర్థిక పురోగతి అంశాలను వివరించారు. కనిగిరిలో ముస్లింలు ఆర్థికంగా ఎంతో వెనుకబడి ఉన్నారని, వారి ఆర్థిక పురోగతికి తమ వంతు సహకారాన్ని అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కోరారు.

ముస్లిం మైనారిటీ నాయకుడు రోషన్ సంధాని ఆధ్వర్యంలో పలువురు ముస్లిం నాయకులు మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలసి సత్కరించారు. కనిగిరిలో షాదిఖానా నిర్మాణానికి కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయాలని కోరారు. కనిగిరిలో చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఎక్కువమంది ముస్లింలు జీవిస్తున్నారని చెప్పారు. వారికి కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జంషీర్ అహ్మద్, షరీఫ్, రెహమాన్, ఖాదర్‌వలి, జానీ, మహమ్మద్గా, మస్తాన్‌బాబు, కరిముల్లా, రహీమ్, ఇర్షాద్, ఖజా తదితరులు పాల్గొన్నారు. కాగా మౌలానా ముస్తాక్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తండ్రి నరసారెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదం

- ఎంఈవోల సంఘ నాయకుడు దేవిరెడ్డి రామిరెడ్డి



విద్యార్థులకు బహుమతులు అందచేసిన ఎంఈవో దేవిరెడ్డి రామిరెడ్డి తదితరులు

కనిగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను సమాయత్తం చేయటమే ఎన్ఎంఎంఎస్ మోడల్ ప్రతిభ పరీక్షల లక్ష్యమని ఎంఈవోల సంఘ నాయకుడు దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో నియోజకవర్గస్థాయి ఎన్ఎంఎంఎస్ ప్రతిభా పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా విజేతల బహుమతుల ప్రధానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పోటీ పరీక్షలు, పాఠ్యాంశాల్లో మంచి పట్టు సాధించేందుకు ఈ ప్రతిభా పరీక్షలు ఎంతో దోహద పడతాయన్నారు. పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలంటే ప్రతి విద్యార్థి ప్రతిభా పోటీ పరీక్షల్లో పాల్గొనాలన్నారు. దీంతో ఏఏ పాఠ్యాంశాల్లో వెనుకబడి ఉన్నామో అవగాహన కలుగుతుందని చెప్పారు.

ప్రతిభా పరీక్షలో వెలిగండ్ల మండల విద్యార్థి ఆర్.ఖాజానాగూర్ ప్రథమ స్థానంలో నిలిచి రూ.5 వేలు బహుమతి సాధించారు. పరీక్షల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఎంఈవోల సంఘం నాయకులు దేవిరెడ్డి రామిరెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పగడాల వెంకటేశ్వరరెడ్డి, గోనుగుంట పవన్‌కుమార్, ద్వారశిల ప్రసాద్‌రెడ్డి, తాళ్ళూరు రమణయ్య, రాంబాబాబు, ఎంఎస్ఎం కరస్పాండెంట్ ఏలూరి నరేంద్ర, ఎంఈవోలు శ్రీనివాసులు, పెద్దిరాజు, నారాయణరెడ్డి, సంజీవి, నాగిరెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహారావు, రాఘవాచారి, విజయలక్ష్మీ, అంజనీదేవి, మాధవరావు, మధు, కోటిరెడ్డి పాల్గొన్నారు.

నమూన పరీక్షల్లో ప్రతిభచాటిన విద్యార్థులు

వెలిగండ్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎంఎంఎస్ జోనల్ స్థాయి నమూన ప్రతిభా పరీక్షల్లో వెలిగండ్ల మండల విద్యార్థులు ప్రతిభ చాటారు ఆదివారం కనిగిరిలో జరిగిన ఈ పరీక్షల్లో వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పరీక్షల్లో ఖాజానాగుర్, జితేంద్ర, కీర్తి రెడ్డి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మండల స్థాయిలో లక్ష్మీప్రియ, జ్ఞానసరస్వతి ప్రతిభ చాటారు. ప్రతిభ కనభరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, నగదును అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాఘవాచారి, ఎంఈవో రామిరెడ్డి, ఉపాధ్యాయులు మధుసూదన్ రెడ్డి, సురేష్‌బాబు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రహదారులను కమ్మేసిన చిల్లచెట్లు

- వాహన చోదకులకు ఇబ్బందులు
- తరచూ రోడ్డు ప్రమాదాలు



అద్దంకి - దర్శి ఆర్‌అండ్‌బీ రహదారిని కమ్మేసిన చిల్ల చెట్లు

ముండ్లమూరు, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రధాన గ్రామాలకు వెళ్ళే రహదారులకు ఇరువైపులా దట్టంగా చిల్లచెట్లు పెరిగాయి. ఫలితంగా, వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు రహదారులను కమ్మేసిన చిల్లచెట్ల తొలగింపు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మండలంలో ప్రధానమైన దర్శి - అద్దంకి ఆర్‌అండ్‌బీ రహదారిలో పోలవరం, పసుపుగల్లు సమీపంలో ఇరువైపులా చిట్లచెట్లు కమ్మేశాయి. దీంతో ఆ రహదారిపై ప్రయాణించే వాహన చోదకులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు.

రాత్రుళ్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. చీకట్లో చిల్లచెట్లను గమనించకపోవటం, ఎదురుగా వచ్చే వాహనాలు కనపడకపోవటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలాగే, మండలంలోని వేంపాడు నుంచి ఈదర వెళ్ళే ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు పెరిగిపోయి ఎదురుగా వచ్చే వాహనం కనిపించని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా తమ్మలూరు, రావిపాడు, పూరిమెట్ల, భీమవరం దగ్గర చిల్లచెట్లు దట్టంగా పెరిగిపోయాయి. దీనికితోడు మూలమలుపులు ఉండటంతో పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. నూజెండ్లపల్లి నుంచి మారెళ్ళ వెళ్ళే రహదారి, ముండ్లమూరు నుంచి సింగనపాలెం వెళ్ళే ఆర్‌అండ్‌బీ రహదారి, పెదరావిపాడు నుంచి నాయుడుపాలెం వెళ్ళే రహదారికి ఇరువైపులా చిల్లచెట్లు పెరిగిపోయాయి.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా పెరిగిపోయిన చిల్లచెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



పట్టణంలో సమస్యలు తెలుసుకుంటున్న నగర పంచాయతీ చైర్మన్ పిచ్చయ్య

సీసీ రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి

దర్శి డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో చేపట్టిన సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు వెంటనే పూర్తి చేయాలని నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని 6వ వార్డులో ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆప్రాంత ప్రజలు మంచినీటి కొళాయిలు ఏర్పాటుచేయాలని కోరారు. అందుకు స్పందించిన పిచ్చయ్య త్వరలో ఇంటింటికి కొళాయి పథకం ద్వారా ఏర్పాటుచేస్తామని చెప్పారు. మురుగు కాల్వల్లో నీరు నిల్వలేకుండా చూడాలని, బ్లీచింగ్ చల్లాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కల్లూరి సుబ్బు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

యాదవులు అన్నిరంగాల్లో రాణించాలి



వన మహోత్సవంలో పాల్గొన్న బాలాజీ, పిన్నిక రమేష్, సూరిబాబు తదితరులు

తాళ్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యాదవులు ఐకమత్యంగా ముందుకు సాగి అన్నిరంగాల్లో రాణించాలని ఏపీటూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ అన్నారు. ఆదివారం కొత్తపట్నంలో జరిగిన కార్తీక వన మహోత్సవ కార్యక్రమానికి నాగంబొట్లపాలెం యాదవ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పలుగ్రామాల నుంచి అధికసంఖ్యలో తరలి వెళ్లారు. ఈసందర్భంగా బాలాజీ మాట్లాడుతూ విద్యావంతులను ప్రోత్సహించి ఉన్నత స్థితిలో ఎదిగేందుకు సంఘం కృషి చేయాలన్నారు. చిన్నా, పెద్దా తారతమ్యాలు లేకుండా అందరూ సహకరించుకుంటే అన్నిరంగాల్లో ముందుంటారన్నారు. కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, వెంకట్రావు, తాళ్లూరు మండల యాదవ సంఘం నేతలు పిన్నిక రమేష్‌బాబు, పాశం సూరిబాబు(పెద్దన్న) తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషిచేయాలి



పామూరు: ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దర్శి డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ పట్ల అవగాహన పెంపొందించుకొని ఆ వ్యాధి నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలని ఎస్ఐ ఎం.మురళి సూచించారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం దర్శిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకుండా క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలు అందుకోవాలని కోరారు. మత్తు పదార్థాలను దరిచేరనీయవద్దని, గొడవల జోలికి పోకుండా యువత ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ దేవతి ప్రసాద్, వైస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి, అధ్యక్షుడు డి.వెంకటరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఎస్వీఆర్ పాఠశాల డైరెక్టర్ తిరపతిరెడ్డి, సీహెచ్ బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ.. సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు చాపకింద నీరులా విజృంభిస్తున్న ఎయిడ్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగిఉండాలని కళాశాల డీన్ డాక్టర్ పి.రఘుపతి పేర్కొన్నారు. సీఎస్‌పురం మండలంలోని కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉద్యాన కళాశాల డీన్ పి.వీరన్నగౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీవిద్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

ముండ్లమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవారిపాలెం రేషన్ షాపు డీలర్ వెంకటరమణపై 6(ఏ) కేసు నమోదు చేసినట్లు పొదిలి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ తెలిపారు. ఆదివారం రేషన్ షాపును తనిఖీ చేయగా పది ప్యాకెట్లు పంచదార తగ్గుదల, బస్తా రేషన్ బియ్యం అదనంగా ఉండటం గుర్తించినట్లు తెలిపారు. దీంతో డీలర్‌పై 6(ఏ) కింద కేసు నమోదు చేసి సరుకులను వీఆర్వో కోటయ్యకు అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, వీఆర్వోలు పెద్దన్న, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్‌బాషాకు పీహెచ్‌డీ ప్రదానం



పీహెచ్‌డీ పట్టా పొందుతున్న ఖాదర్‌బాషా

దొనకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కేఎల్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవం సందర్భంగా దొనకొండకు చెందిన షేక్ ఖాదర్ బాషాకు మేనేజ్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీ ప్రదానం చేశారు. యూనివర్సిటీకి చెందిన డాక్టర్ అకొండి శ్రీకాంత్, అసోసియేట్ ప్రొఫెసర్, మేనేజ్‌మెంట్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో మార్కెటింగ్ కార్యకలాపాల్లో గల లోపాలు అనే ఇతివృత్తంపై చేసిన పరిశోధనలపై పీహెచ్‌డీ ప్రదానం చేశారు. కేఎల్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నట్లు ఖాదర్‌బాషా తెలిపారు. ఈసందర్భంగా ఖాదర్‌బాషాను పలువురు అభినందించారు.

సొంత భవనానికి నోచుకోని అంగన్‌వాడీ కేంద్రం


దొనకొండ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని ఒబ్బాపురం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం 27 సంవత్సరాలుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధునిక వసతులతో తీర్చిదిద్దుతామని చెప్పిన గత పాలకులు ఈ కేంద్రానికి సొంత భవనం ఏర్పాటుగురించి పట్టించుకోలేదు. ఇటీవల దొనకొండ పర్యటనకు విచ్చేసిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మిని అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల కలిసి అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం లేక పడుతున్న ఇబ్బందులను ఏకరువుపెట్టారు. భవనం మంజూరుకు చర్యలు చేపట్టాలని కోరారు. కాలనీలో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి భవనాలు లేకపోవటంతో ఎన్నికల సమయంలో ఓట్లు వేసేందుకు సుదూర ప్రాంతంలోని పాఠశాల వద్దకు వెళ్లాల్సి వస్తుందని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి పక్కా భవనం మంజూరుకు తక్షణ చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు బోల్తా.. ఏడుగురికి గాయాలు

కనిగిరి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు బోల్తాపడి ఏడుగురికి గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం తెల్లవారు జామున మదనపల్లి వద్ద చోటుచేసుకుంది. కనిగిరి నుంచి బెంగుళూరు వెళుతున్న బస్సు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లోకి దిగిపోయి బోల్తాపడింది. ఈప్రమాదంలో కనిగిరి ప్రాంతానికి చెందిన ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వెలిగండ్ల మండలం వెదుళ్ళచెరువుకు చెందిన చిన్నయ్య అనే వ్యక్తి తలకు తీవ్రగాయమైంది. అపస్మారక స్థితిలోకి వెళ్ళిన చిన్నయ్యను మదనపల్లిలోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన బస్సు మదనపల్లి ఆర్టీసీ డిపోలో ఉన్నట్లు డీఎం షయానబేగం తెలిపారు. తీవ్రగాయాలైన చిన్నయ్యకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు.






స్వచ్ఛజలం.. అందేనా?

జల్‌జీవన్‌తో..
ప్రతీ ఇంటికి కుళాయిల ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలి. గ్రామీణుల ఆరోగ్యాల్ని పరిరక్షించాలి. 2024 మార్చి కల్లా పనులు పూర్తి చేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. కానీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో జల్‌జీవన్ పనుల్లో పురోగతి కనిపించడంలేదు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు తాగునీటి పథకాల అభివృద్ధిని విస్మరించింది. దీంతో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందని ద్రాక్షలా మారింది. రాష్ట్ర ప్రభుత్వం నిధులను పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడంతోనే జల్‌జీవన్ మిషన్ అమలులో జాప్యం జరిగింది. నిధుల కొరతతో బిల్లుల చెల్లింపులు జరగక పోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలివేశారు. కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయగా రాష్ట్ర ప్రభుత్వం వాటిని దారిమళ్లించడంతోనే పనులు ముందుకు సాగలేదు. జలజీవన్ అమలులో పల్నాడు, బాపట్ల జిల్లాలు రాష్ట్రంలోనే చిట్టచివర స్థానాల్లో ఉన్నాయంటే అధికారుల పనితీరు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు కూటమి నేతలు ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో ఈ పథకం పనులు అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సి ఉంది.

తాగునీటి చెరువు



శిథిలావస్థలో ఓవర్ హెడ్ ట్యాంక్

- ముందుకు సాగని జలజీవన్
- గ్రామాల్లో తాగునీటి వెతలు తీవ్రం
- నిధులున్నా పనుల నిర్వహణలో నిర్లక్ష్యం
- ప్రతి ఇంటికి అందని ద్రాక్షాలా స్వచ్ఛమైన తాగునీరు
- పథకం అమల్లో రాష్ట్రంలోనే చిట్టచివరన పల్నాడు, బాపట్ల జిల్లాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
స్వచ్ఛమైన.. సురక్షితమైన.. తాగునీటిని ప్రతి ఒక్కరికీ అందించాలి. ప్రధానంగా ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి కుళాయిల ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను చేపట్టింది. ఇంటింటికీ స్వచ్ఛజలాన్ని సరఫరా చేసే సంకల్పంతో 2019లో ఈ పథకం అమల్లోకి తెచ్చింది. కేంద్ర ప్రభుత్వ లక్ష్యమైన కుళాయిల ద్వారా తాగునీరు అందివ్వడం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో కష్టంగా మారింది. ప్రస్తుతం ఉన్న నీటి పథకాల ద్వారా ప్రతి వ్యక్తిగా 40 లీటర్లు నీరు అందుతుంది. జల్‌జీవన్ పథకం ద్వారా ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వాల్సి ఉంది. తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరు శాతం కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేయడమే ఈ పథకం లక్ష్యం. ఇందుకు రూ.1021.38 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేరి సగం నిధులతో జల్‌జీవన్ పనులు చేపట్టారు. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన విషయం తెలిసిందే. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. అయితే రాష్ట్రంలో వైసీపీ పాలకుల తీరుతో లక్ష్యం నీరుగారిపోయింది. జలజీవన్ మిషన్

కుళాయిలు.. 43.88 శాతం

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 4,53,251 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. అంటే స్వచ్ఛజలం కుళాయిల ద్వారా 43.88 శాతం గృహాలకే అందుతోంది. ఇంకా 5,79,653 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాలి. గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపు లైన్లు, తాగునీటి చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాల్సి ఉంది. మూడు జిల్లాల పరిధిలో జల్‌జీవన్ పథకం పనులు నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.

కుళాయిలు ఇలా..

జిల్లా	గృహాలు	కుళాయిలున్న ఇళ్లు	లేని ఇళ్లు
పల్నాడు	4,34,399	1,47,166	2,87,233
గుంటూరు	2,33,717	1,57,724	75,993
బాపట్ల	3,64,788	1,48,361	2,16,427

బాపట్ల జిల్లా 25వ స్థానం

బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్రంలో 25వ స్థానంలో నిలిచింది. జిల్లా పరిధిలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉండగా జల్‌జీవన్ ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 76,069 గృహాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. అంటే జిల్లాలో మొత్తం 1,48,361 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. 19.82 శాతం నుంచి 40.67 శాతానికి కుళాయిల సంఖ్య పెరిగింది. ఇంకా 2,16,427 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి. రూ.205.22 కోట్లు వ్యయం అంచనాతో జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి.

పథకం పనుల్లో పురోగతి

(మిగతా 8వ పేజీలో..)

- జిల్లా కేంద్రంలో ఇంకా అరకొర వసతులే
- ఇరుకు గదుల్లోనే పలు జిల్లా కార్యాలయాలు
- కార్యాలయాల్లో సిబ్బందికి.. ఫర్నీచర్‌కూ కొరతే
- ప్రైవేటు భవనాల్లోనే పలు శాఖల కార్యాలయాలు
- ప్రతిపాదనల దశలోనే సమీకృత కలెక్టరేట్ నిర్మాణం

రెండున్నరేళ్లయినా.. తప్పటడుగులే..



ఓ కళాశాల భవనంలో కొనసాగుతున్న జిల్లా విద్యాశాఖ కార్యాలయం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
పరిపాలనా సౌలభ్యం పేరుతో లోక్‌సభ నియోజకవర్గాల ప్రాతిపదికగా గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన జిల్లాల విభజన జరిగి రెండున్నరేళ్లు అవుతుంది. అయితే ఇంకా తప్పటడుగుల్లోనే జిల్లా పరిపాలన సాగుతోంది. పూర్తి స్థాయిలో ఇంకా కార్యాకలాపాలు జరగడం లేదు. కొత్త జిల్లా ఏర్పాటుతో పరిపాలన అందుబాటులోకి వస్తుందని ఆశ పడిన ప్రజలు జరుగుతున్న పాలనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం హడావిడిగా జిల్లా ఏర్పాటుకు పూనుకుందే తప్ప పాటించాల్సిన నిబంధనలను పట్టించుకోలేదు. జిల్లా ఆవిర్భావం సమయంలోనే ప్రత్యేక నిధులు కేటాయించాల్సి ఉన్నప్పటికీ అలాంటి ప్రయత్నమేమీ జరగలేదు. దీంతో ఏ ఒక్క కార్యాలయంలోనూ కనీస సదుపాయాలు, ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది లేకపోవడంతో అరకొర వనరులతోనే కార్యాలయాలను నడిపించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లా కేంద్రంలో కార్యాలయాలు ఉన్నా కొందరు అధికారులు, ఉద్యోగులు ఇంకా గుంటూరు నుంచే విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయాల్లో వసతులు లేక ఉద్యోగులు ఇక్కట్లు పడుతున్నారు. ప్రైవేట్ భవనాల్లో కొన్ని కార్యాలయాలు ఏర్పాటు కాగా ప్రభుత్వం నిర్ణయించిన అద్దె సరిపోక అధికారులు సొంతంగా చెల్లించాల్సిన పరిస్థితులు నెలకున్నాయి. జిల్లాకు సంబంధించి బాపట్ల కేంద్రంగా పూర్తి స్థాయిలో కార్యాకలాపాలు జరగడం లేదు. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలు, వారి నివాసాలకే వసతులు పరిమితమయ్యాయి. కొన్ని ప్రధాన కార్యాలయాలకు నేటికీ కూడా కనీసం ఫర్నిచర్ సరఫరా చేయలేదు. కనీస వసతులు లేకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారుల నియామకాలు జరగలేదు. జిల్లా అధికారుల పోస్టులను మంజూరు చేసిన గత ప్రభుత్వం నియామకాలను విస్మరించింది. రెండున్నరేళ్ల నుంచి వెంటాడుతున్న బాలారిష్టాలకు కూటమి ప్రభుత్వంలో పరిష్కారం దొరుకుతుందని పలువురు ఆశ పెట్టుకున్నారు. కానీ ఇటీవల జరిగిన బదిలీల్లో సిబ్బంది నియామకం దగ్గర నుంచి జిల్లా అధికారుల పోస్టుల వరకు పాత తంతే నడవడం నిరాశపర్చింది. అటు సిబ్బంది విషయంలో కానీ, ఇటు ఖాతాల విభజన అంశంలో కానీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన ఉంది తప్పితే ఎలాంటి మార్పు లేదు. జిల్లా ఏర్పాటు సమయంలోనే అదనంగా జిల్లా స్థాయి పోస్టులను నోటిపై చేయాలి. కానీ ఆ పని చేయకపోవడంతో ఇప్పుడు చాలా విభాగాలు ఇన్‌చార్జిలతోనే నెట్టుకురావాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నాయి.

1500 పైగా పోస్టులు ఖాళీ..

మార్గదర్శకాల ప్రకారం జిల్లా కార్యాలయాల్లో ఉండాల్సిన నిష్పత్తిలో సిబ్బంది లేరు. ఉన్న అరకొర సిబ్బంది కూడా అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసే వారే ఎక్కువ. జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో 28 మందికి కేవలం 9 మంది మాత్రమే ఉన్నారు. వ్యవసాయశాఖ 15 మంది సిబ్బందితోనే సరిపెట్టుకోవాల్సిన దుస్థితి. గృహ నిర్మాణ, పౌరసరఫరాల శాఖ ఇలా ప్రతి విభాగంలోనూ సిబ్బంది కొరతే. జిల్లాలోని అన్ని శాఖల్లో ఖాళీ చేయాల్సిన పోస్టులు దాదాపు 1500కు పైగానే ఉన్నాయి. మండల కార్యాలయాల్లో విధులు నిర్వహించే సిబ్బందిని డిప్యూటేషన్‌పై కలెక్టరేట్‌లో విధులు కేటాయించారు. దీంతో ఆయా కార్యాలయాల్లో సరిపడా సిబ్బంది లేక పనులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. జిల్లాలో వివిధ హోదాల్లో రెవెన్యూ సిబ్బందికి సంబంధించి దాదాపు 200 వరకు ఖాళీలు ఉన్నట్లు సమాచారం.

డజనుకుపైగా శాఖల్లో ఇన్‌చార్జిలే దిక్కు..

బాపట్ల జిల్లా ఏర్పాటులో అధికారులకు సంబంధించి కొత్త పోస్టులు నోటిఫికేషన్ చేయకపోవడంతో చాలా విభాగాలను ఇన్‌చార్జి హోదాలతోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి ఉంది. టూరిజం, మెప్మా, డీఆర్‌డీఏలకు ఇన్‌చార్జి అధికారులే దిక్కుగా ఉన్నారు. హార్టికల్చర్ విభాగం జిల్లా అధికారిగా ఉన్న జెన్నమ్మనే ఏపీఎంఐసీ ఇన్‌చార్జి పీడీగా ఎప్పటి నుంచో వ్యవహరిస్తున్నారు. జిల్లా పరిశ్రమల అధికారి పోస్టు ఇంకా ఖాళీగానే ఉంది. రేపల్లె, భట్టిప్రోలు, కారంచేడు, బాపట్ల మండలాలకు తహసీల్దార్లుగా ఇన్‌చార్జిలే విధులు నిర్వహిస్తున్నారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీలో ప్రాధాన్య పోస్టుల్లో శాశ్వత నియామకాలు చేపట్టలేదు. జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న చాలామంది అధికారులు డిప్యూటేషన్‌పైనే విధులు నిర్వహిస్తున్నారు.

15 విభాగాలు అద్దె భవనాల్లోనే...

దాదాపు పదిహేను విభాగాల కార్యాలయాలు వేరే వాటి పంచన లేక ప్రైవేటు భవనాల్లోనే ఉన్నాయి. వ్యవసాయ, సహకార, బీసీ కార్పొరేషన్, సమగ్ర శిక్ష అభియాన్, విద్యాశాఖ, ఇంటర్మీడియట్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ కార్యాలయాలు ఓ కళాశాల భవనంలో ఉన్నాయి. దీంతో కళాశాలలో విద్యార్థులకు తరగతులు నిర్వహించుకోవడం సదరు యాజమాన్యానికి ఇబ్బందిగా ఉన్నా సర్దుకుపోవాల్సిన పరిస్థితి. మైనింగ్, అటవీ, ఫుడ్‌సేఫ్టీ విభాగాలతో పాటు మరికొన్ని కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లోనే అద్దె ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. జిల్లా ఏర్పడిన దగ్గరనుంచి ఇప్పటి వరకు రెండు మూడు విభాగాలు అయితే పలు చోట్లకు కార్యాలయాలను మార్చుకోవాల్సి వచ్చింది. మున్సిపల్ కార్యాలయభవనంలో కొనసాగుతున్న ఐ అండ్‌పీఆర్ కార్యాలయాన్ని తరలించాలని చెప్పడంతో వేరే భవనం కోసం వారు అన్వేషణ ప్రారంభించారు. సమీకృత కలెక్టరేట్ నిర్మాణం చేపడతామని గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది.అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.



శిథిలమైన భవనంలో కొనసాగుతున్న జిల్లా పంచాయతీ కార్యాలయం

సమస్యలపై జనాన్ని కదిలించాలి

ప్రజలతో సంబంధాలు పెంచుకోవాలి
సీపీఎం జిల్లా ప్రథమ మహాసభలో బాబూరావు

బాపట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు, వర్గసమస్యలపై పోరాటం సాగించి స్థానికంగా జనాన్ని కదలించాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు సి.హెచ్. బాబురావు పిలుపునిచ్చారు. బాపట్లలోని ఎం.ఎస్.ఆర్ కల్యాణ మండపంలో రెండురోజులుగా జరుగుతున్న సీపీఎం బాపట్ల జిల్లా ప్రథమ మహాసభలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో నిత్య సంబంధాలు పెంచుకోవాలన్నారు. పాలకవర్గాలకు వ్యతిరేకంగా నిలబడి పేద ప్రజలందర్నీ సమీకరించి పోరాటాలు చేసిన చరిత్ర బాపట్ల ప్రాంత కమ్యూనిస్టుయోధులకు ఉందన్నారు. అదానీ, మోదీ కుంభకోణంలో వైసీపీ అధినేత జగన్‌తోపాటు కూటమి నాయకులు కూడా దోషులేనని ఆరోపించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి మాట్లాడుతూ ఉద్యమాలకు బాపట్ల జిల్లా ఒక రోల్‌మోడల్ కావాలన్నారు. సభకు ముందు పార్టీపతకాన్ని ఆవిష్కరించి, ఏచూరి సీతారాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రజా నాట్యమండలి కళాకారులు కిరణ్, బొనిగల సుబ్బారావు విప్లవ గీతాలు ఆలపించారు. చిన్నారి బొనిగల ఆద్యశ్రీ భరత నాట్యం ఆలరించింది.



సీతారాం ఏచూరి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న రమాదేవి, బాబూరావు తదితరులు

సభలో తీర్మానాలు

కౌలురైతు అభ్యున్నతి కోసం కృషి చేయాలని, కౌలురైతు చట్టం చేయాలని, ఆత్మహత్యలను నివారించాలని, రైతు సమస్యలు, వ్యవసాయసాగు సమస్యలు లేకుండా ప్రభుత్వం తక్షణమే పనిచేయాలని, కార్మిక సమస్యలు పరిష్కారం కోసం లేబర్ కోర్టు, జిల్లా కేంద్రంలో ఈఎస్‌ఐ ఆస్పత్రి నెలకొల్పాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నూతలపాటి కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి సి.హెచ్.గంగయ్య, టి.కృష్ణమోహన్, సి.హెచ్.మజుందార్, ఎస్.బాబురావు, సి.హెచ్.మణిలాల్, ఆంజనేయులు, ఝాన్సీ పాల్గొన్నారు.

రేషన్ దరఖాస్తులు స్వీకరించాలా.. వద్దా?

- గ్రామ, వార్డు సచివాలయాల్లో సందిగ్ధ పరిస్థితి
- ఆదివారం రాత్రికి కూడా జారీ కాని మార్గదర్శకాలు
- ఈ ఏడాది జనవరి నుంచి అర్హుల ఎదురు చూపు

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకారంపై సందిగ్ధత నెలకొన్నది. గత కొన్ని రోజులుగా డిసెంబరు 2వ తేదీ(సోమవారం) నుంచి 28వ తారీఖు వరకు అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్‌కార్డులు, ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పులకి కూటమి ప్రభుత్వం అవకాశం కల్పించబోతున్నదని, కొత్త డిజైన్లతో రేషన్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు విస్తృతంగా ప్రచారం జరిగింది. సంక్రాంతి పండుగకి కొత్తకార్డులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం రాత్రి వరకు మార్గదర్శకాలు ప్రభుత్వం నుంచి జారీ కాలేదు. దీంతో సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరించాలో, లేదో తెలియని పరిస్థితి అధికారుల్లో నెలకొన్నది. ఇంచుమించు 10 నెలలుగా కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను గ్రామ/వార్డు సచివాలయాల్లో స్వీకరించడం లేదు. ఇందుకు సంబంధించి ఈ-పోస్ సైట్‌ని బ్లాక్ చేశారు. జనవరి, ఫిబ్రవరిలో వచ్చిన దరఖాస్తులు వందల్లో పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారులు తెలిపారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్‌తో రేషన్‌కార్డులకు సంబంధించి ఎలాంటి దరఖాస్తులను స్వీకరించలేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పడగా వైసీపీ రంగులతో ఉన్న రైస్‌కార్డులను తొలగించాలని నిర్ణయించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జారీ చేసిన రేషన్‌కార్డుల్లో మొత్తం కుటుంబ సభ్యుల ఫొటో ఉండేది. అలానే కుటుంబ పెద్ద, వృత్తి, పుట్టిన తేదీ, వయస్సు, వార్షికాదాయం వంటి వివరాలు ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించి రైస్‌కార్డులంటూ సచివాలయాల ద్వారా పంపిణీ చేసింది. ఆ కార్డుల్లో కుటుంబ సభ్యుల ఫొటోని తీసేసి కేవలం ఆ కుటుంబంలో మహిళ ఫొటోని మాత్రమే ఉంచింది. ఆ కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణించలేని పరిస్థితి. కాగా కొత్తకార్డులు, స్ప్లిట్‌కార్డులు, ఇతర సవరణల కోసం పెట్టుకున్న దరఖా స్తులను నిలిపేసింది. ఆరంచెల మూల్యాంకనం ద్వారా వేలల్లో కార్డులను తొలగించింది. ఈ కారణంగా వారు వంట గ్యాస్ సబ్సిడీకి కూడా దూరమయ్యారు. ఇతర సంక్షేమ పథకాలను కూడా పొందలేక పోయారు. గుంటూరు జిల్లాలో ఇప్పటికే 5 లక్షల 99 వేల 511 కుటుంబాలకు రేషన్‌కార్డులున్నాయి. బాపట్ల జిల్లాలో 4 లక్షల 80 వేల 29, పల్నాడు జిల్లాలో 6 లక్షల 45 వేల 110 కుటుంబాలకు రేషన్‌కార్డులున్నాయి. అయితే ఇంకా అర్హులు మిగిలిపోయి ఉండటంతో వారికి కార్డులు పంపిణీ చేయాలని కూటమి ప్రభు త్వం భావిస్తున్నది. తగిన మార్గదర్శకాలు రాకపోవడంతో సోమవారం నుంచి సచివాలయాలకు దరఖాస్తులతో వచ్చే వారికి ఏమి సమాధానం చెప్పాలో తెలియని పరిస్థితి నెలకొన్నదని అధికారవర్గాలు తెలిపాయి.

ఎమ్మెల్సీ ఓటు ఉందా.. లేదా?

- సీఈవో ఆంధ్ర వెబ్‌సైట్‌లో తెలుసుకునే సౌలభ్యం
- ఒకవేళ లేకుంటే మళ్లీ క్లెయిమ్ చేసుకునే అవకాశం

గుంటూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గానికి సంబంధించి త్వరలో జరగనున్న ఎన్నిక కోసం ముసాయిదా ఓటర్ల జాబితాలు అంతర్జాలంలో అందుబాటులోకి వచ్చాయి. ఆరు జిల్లాల నుంచి అర్హులైన పట్టభద్రులు ఓటు నమోదు కోసం దరఖాస్తు చేసుకోగా వాటిని క్షేత్ర పరిశీలన జరిపిన ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు అన్నీ సవ్యంగా ఉన్న వాటిని ఆమోదించారు. సర్టిఫికెట్లు సరిగా పొందుపరచిన వారి దరఖాస్తులను తిరస్కరించారు. అర్హులకు ఓటుహక్కు కల్పించిన జాబితాలను జిల్లాల వారీగా సీఈవోఆంధ్ర.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నిక్షిప్తం చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పట్టభద్రుడికి ఓటు మంజూరైందో, లేదో తెలుసుకునే సదుపాయం ఈ వెబ్‌సైట్‌లో కల్పించారు. అర్హత ఉండి ఎవరికైనా ఓటు రాకపోయినా, ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోకపోయినా ప్రస్తుతం జరుగుతున్న క్లెయిమ్‌లు/అభ్యంతరాల స్వీకారం సందర్భంగా అందజేయొచ్చని ఈఆర్‌వో ఎస్ఎస్‌కే ఖాజావలి తెలిపారు.



ఇలా తెలుసుకోచ్చు...

తొలుత సీఈవోఆంధ్ర.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌ని వెబ్‌బ్రౌజర్ నుంచి తెరవాలి. అందులో ఎంఎల్‌సీ ఈ రిజిస్ట్రేషన్ -2024లోకి వెళ్లి ట్రాక్ యువర్ అప్లికేషన్ స్టేటస్‌ని మౌస్‌తో క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో ఓపెన్ అవుతుంది. అందులో గ్రాడ్యుయేట్ అనే ఆప్షన్‌ని సెలెక్ట్ చేయాలి. అప్లికేషన్ ఐడీ/ దరఖాస్తు దారుడి పేరు/ ఇంటి నంబరులో ఏదో ఒకటి ఎంపిక చేసుకుని ఆ వివరాలను ఎంటర్ సెర్చ్ వాల్యూలో పొందుపరిచి సెర్చ్‌ని క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో తెరుచుకుని అందులో ఏపీపీ ఐడీ, సబ్మిషన్ డేట్, పీఎస్ నంబరు. ఎస్ఎల్ నంబరు, పేరు, రిలేషన్ నేమ్, హౌస్ నంబరు, ఏఈఆర్‌వో, ఈఆర్‌వో కామెంట్స్, ఏపీపీ స్టేటస్ వివరాలు ప్రత్యక్షమౌ తాయి. అందులో ఏపీపీ స్టేటస్‌లో యాక్సెప్టెడ్ అని ఉంటే మీ ఓటు నమోదైనట్లే. అప్పుడు పీఎస్ నంబరు, సీరియల్ నంబరుని ఒక పేపర్ మీద రాసుకోవాలి. ఆ తర్వాత విండోని మూసేసి హోం పేజీకి వెళ్లి ఎలక్టోరల్ రోల్స్‌లో మెనూ ఏపీ ఎమ్మెల్సీ టీచర్స్ గ్రాడ్యుయేట్ రోల్స్-2024పై మౌస్‌తో క్లిక్ చేయాలి. ఆ వెంటనే మరో విండో తెరుచుకుని ఈస్టు-వెస్టు గోదావరి అండ్ కృష్ణా - గుంటూరు గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గాల డ్రాఫ్టు రోల్స్-2024ని ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. దాంతో మరో విండో తెరుచుకుంటుంది. అందులో సెలెక్ట్ కాన్‌స్టిట్యూయెన్సీ డ్రాప్‌డౌన్ మెనూలో 3 నంబరులో ఉన్న కృష్ణా - గుంటూరుని ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత పక్కనే జిల్లాని ఎంపిక చేసుకోవాలి. అనంతరం గెట్ పోలింగ్ స్టేషన్స్ అనే దానిపై క్లిక్ చేస్తే పోలింగ్ స్టేషన్ నంబరు, పేరు, లోకేషన్ జాబితా తెరుచుకుంటుంది. ఆ తర్వాత ఇంతకుముందు కాగితం మీద రాసుకున్న పోలింగ్‌స్టేషన్‌ని శోధించి వ్యూ మీద క్లిక్ చేస్తే మరో విండో తెరుచుకుని వెరిఫికేషన్ కోడ్‌ని అక్కడ ఉన్నది యథాతథంగా ఎంటర్ చేయమని చెబుతుంది. ఆ కోడ్‌ని ఎంటర్ చేసి సబ్‌మిట్ కొట్టగానే ఓటర్ జాబితా డౌన్‌లోడ్ అవుతుంది. అందులో సీరియల్ నంబరు చూసుకుంటే ఓటు ఉన్నది, లేనిది తెలిసిపోతుంది.

ఓటు లేకపోతే...

ఒకవేళ ముసాయిదా ఓటర్ జాబితాలో పేరు లేకపోతే మళ్లీ ఓటుహక్కు కోసం క్లెయిమ్ దాఖలు చేసుకోవచ్చు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ సదుపాయం అందుబాటులో ఉన్నది. డిసెంబరు 9వ తేదీ వరకు క్లెయిమ్‌లు దాఖలు చేసుకునేందుకు గడువు తేదీ ఉన్నది. ఆ తర్వాత క్లెయిమ్‌లను పరిష్కరించి డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితాని ప్రచురిస్తారు. కాగా ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అర్హులైన పట్టభద్రులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఓటరుగా నమోదు అయ్యే అవకాశం ఉన్నది.

పాత చెన్నై రహదారికి మోక్షం ఎప్పుడు?

- పెరిగిన వాహనాల రద్దీ
- తరచూ ట్రాఫిక్ సమస్యలు
- రోడ్డు అభివృద్ధికి ఎదురుచూపులు

పర్చూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వాహనాల రద్దీతో నిత్యం కిటకిటలాడే పాత చెన్నై (మద్రాస్) రోడ్డు అభివృద్ధికి మోక్షం కలిగేనా అన్న సందేహం అందరిలోనూ ఉంది. ఏళ్ల తరబడి ఈరోడ్డు అభివృద్ధి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ రోడ్డును జాతీయ రహదారుల జాబితాలో చేర్చాలని నాలుగేళ్ల కిందటే కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీకి వినతులు కూడా అందజేశారు. దీనిపై పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసినా సంబంధిత అధికారుల్లో చలనం లేదు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత పాత మద్రాసు రోడ్డు అభివృద్ధిపై స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టిసారించారు. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని జాతీయ రహదారులు జాబితాలో చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదన కూడా ఇచ్చారు. గుంటూరు నేషనల్ హైవే ఎన్‌హెచ్-5 నుంచి జాతీయ రహదారి నాగులుప్పలపాడు వరకు దాదాపు 80 కిలో మీటర్ల మేర రోడ్డును విస్తరించి అభివృద్ధి చేస్తే గుంటూరు - బాపట్లతోపాటు ప్రకాశం జిల్లాలోని ప్రజలకు



గుంటూరు - పర్చూరు మీదుగా పాత చెన్నైకి వెళ్లే రోడ్డులో రద్దీ

వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రాష్ట్ర రాజధాని అమరావతికి వెళ్లేందుకు దగ్గర మార్గంగా ఏర్పడుతుంది. రోడ్డును డబుల్ లైన్‌గా విస్తరించేందుకు సరిపడా వెడల్పు ఉన్నందున భూసేకరణ చేయాల్సిన అవసరం కూడా లేదు. ప్రత్తిపాడు, పెద్దనందిపాడు, పర్చూరు, ఇంకొల్లు, రాపూడి, కొణికి తదితర గ్రామాల్లో సైతం రహదారిని ఆక్రమించుకొని అంచుల్లో డ్రైనేజీ కాలువను పూడ్చి నిర్మాణం చేసుకున్న కట్టడాలను తొలగించి రహదారిని విస్తరిస్తే భూసేకరణతో అవసరం లేకుండా సురక్షమైన రహదారి మార్గం ఏర్పడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా పీపీ పద్ధతిలో గుంటూరు నుంచి పర్చూరు వరకు 42 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం చేపట్టేలా ప్రతిపాదన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం కన్నా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఈరోడ్డును జాతీయ రహదారుల జాబితాలో చేర్చడం వల్ల ప్రభుత్వానికి భారం తగ్గడంతోపాటు, ప్రయాణికులకు టోల్ గేట్ బెడద కూడా తక్కువగా ఉంటుందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పాత చెన్నై రహదారిని అభివృద్ధి చేయడం వల్ల చెన్నై, కోల్‌కతా, ఒంగోలు, దిగమర్రు వంటి జాతీయ రహదారులకు ప్రత్యామ్నాయంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా పాత మద్రాసు రోడ్డును అభివృద్ధి చేస్తే ఈప్రాంతం ట్రాన్స్ పోర్టు సౌకర్యంతోపాటు, ఆయా మార్గాలకు ప్రయాణం సులభతరం అవుతుందని ప్రజలు, వాహన దారులు అంటున్నారు. ఆదిశగా అధికారులు ప్ర జా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పాత చెన్నై రోడ్డును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అమ్మవారి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కొండయ్య

చల్లగా చూడమ్మా.. నాగవరపమ్మా

అమ్మవారి ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం, ఆదివారం, అమావాస్య కలసి వచ్చిన విశిష్ట రోజు కావడంతో ఆదివారం రామన్నపేట పంచాయతీ పరిధిలోని శ్రీ కనక నాగవరపమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలసి అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరినీ చల్లగా చూడమ్మా .. నాగవరపమ్మ తల్లీ అంటూ వేడుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈవో పోతిని శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే కొండయ్యను సాదరంగా ఆహ్వానించారు. పూజా కార్యక్రమాల అనంతరం సన్మానించారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే చెప్పారు. భక్తులతో కాసేపు మాట్లాడారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. కొందరు కోరిన కోర్కెలు నెరవేరడంతో మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బృందాలుగా భోజనాలు తయారు చేసుకుని తిన్నారు. కొందరు అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. భక్తుల రద్దీతో తిరునాళ్ల వాతావరణాన్ని తలపించింది. సినీ నటుడు అజయ్‌ఘోష్ అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వేణుగోపాలరావు, సూపరింటెండెంట్ రమేష్‌నాయక్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కఠారివారిపాలెం తీరంలో ప్రత్యేక పూజలు

ఆదివారం కఠారివారిపాలెం సముద్రతీరంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. మత్స్యకారులతో మాట్లాడారు. వారు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల భర్తీకి 9న పరీక్ష

బల్లికురవ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న 10 మండలాల్లో ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల భర్తీకి ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పర్యవేక్షణలో ఈనెల 9వ తేదీన రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కవిత ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. రేషన్ డీలర్ల పోస్టులపై ఆసక్తి కలిగిన వారు వెంటనే తహసీల్దార్ కార్యాలయంలో వివరాలను తెలుసుకోవాలని ఆమె కోరారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా 2వ తేదీన జరగాల్సిన రాత పరీక్ష 9వ తేదీకి వాయిదా పడిందని తెలిపారు.

చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి



శ్రీనివాసరావు మృతదేహం

బల్లికురవ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్రెపాడుకు చెందిన ఐ-టీడీపీ కార్యకర్త గుంటూరు శ్రీనివాసరావు (34) శనివారం అర్ధరాత్రి వైద్య శాలలో చికిత్స పొం దుతూ మృతి చెందాడు. గొర్రెపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు కొంతకాలం కిందట మంత్రి నారా లోకేష్ టీంలో పనిచేసి ఉన్నాడు. రెండేళ్ల కిందట స్వగ్రామానికి వచ్చి గ్రామంలో ఉంటూ ఆర్థికంగా బాగా దెబ్బతిని అప్పులపాలు అయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన శ్రీనివాసరావు శనివారం ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే వారి బంధువులు చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు. ఈ విషయం మంత్రి లోకేష్ దృష్టికి వెళ్లగానే వెంటనే విజయవాడ వైద్యశాలకు ఉన్నత చికిత్సకు తరలించాలని పార్టీ నేతలకు ఆదేశాలు ఇవ్వగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనయుడు హర్షవర్ధన్ ఆసుపత్రికి వెళ్లి శ్రీనివాసరావును విజయవాడ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అండగా ఉంటాం : మంత్రి గొట్టిపాటి

గొర్రెపాడు గ్రామానికి చెందిన ఐటీడీపీ కార్యకర్త శ్రీనివాసరావు మృతి చెందడం బాధకరం అని ఆయన కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీనివాసరావు మృతి చెందిన విషయానిన తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. కార్యకర్తలు ఎవరైనా ఇబ్బందులు వస్తే ఆత్మహత్యలు చేసుకోవద్దని పార్టీ అండగా ఉంటుందని సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే పార్టీ పరంగా ఆదుకుంటామని ఒక ప్రకటనలో మంత్రి పేర్కొన్నారు.

ప్రారంభమైన క్రిస్మస్ క్యారల్స్

చినగంజాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్‌నగర్‌లో క్రిస్మస్ పండుగ సందర్భంగా క్రిస్మస్ క్యారల్స్ కార్యక్రమాన్ని ఆదివారం వేకువజామున ఘనంగా ప్రారంభించారు. ఈనెల 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మేకల మేషక్‌బాబు తెలిపారు. అంబేడ్కర్‌నగర్ గ్రామ పెద్దలు, ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో క్యారల్స్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు మేడికొండ ప్రభుకుమార్, ధనుంజయ్ కేకు కట్ చేసి సండే స్కూల్ చిన్నారులకు, యువతీయువకులకు పంచి పెట్టారు. అనంతరం చినగంజాం గ్రామ పురవీధులలో క్రిస్మస్ క్యారెల్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

బల్లికురవ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమవరం గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి బైకుపై వస్తున్న వారిని గ్రానైట్ లారీ ఢీకొనడంతో కొప్పరం గ్రామానికి చెందిన ఏడాదిన్నర వయసు చిన్నారి షేక్ కానున మృతి చెందింది. సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన షేక్ మున్నీర్ బాషా తన భార్యతో కలిసి పాపతో చిలకలూరిపేట వైద్యశాలకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా, ముందు గ్రానైట్ లారీ వెళుతుండగా మరో ఆటో లారీని క్రాస్ చేయబోతుండగా మున్నీర్ బాషా బైకును లారీ తగడంతో అదుపు తప్పి బైకు కింద పడిపోయింది. దీంతో తల్లి ఒడిలో ఉన్న పాప రోడ్డుపై పడి పోయి లారీ వెనుక భాగం తగిలి మృతి చెందింది. ఎస్ఐ జీవీ చౌదరి పరిశీలించారు. బాషా ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



అనధికార లేఅవుట్ల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

నోటీసులిస్తాం .. రుసుం వసూలు చేస్తాం

- ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు
- అక్కాయిపాలెం పరిధిలో అక్రమ లేఅవుట్ల పరిశీలన

వేటపాలెం(చీరాల), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూములను, వ్యవసాయేతర అవసరాలకు ఉపయోగించేందుకు రియల్ వ్యాపారులు, ఇతరులు ఎవరైనా సరే నిబంధనల మేరకు రుసుం చెల్లించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు చెప్పారు. లేదంటే తగిన చర్యలు చేపడతాం, ముందుగా నోటీసులు ఇచ్చి రుసుం వసూలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మండల పరిధిలో పలు ప్రాంతాల్లో వేసిన అనధికారిక లేఅవుట్లను, ఖాళీ స్థలాలను ఆదివారం ఆర్డీవో రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలో 216 జాతీయ రహదారి పక్కన అనధికారిక అలేవుట్‌గా పంచాయతీ వారు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన ప్రదేశంతో పాటు పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లతో అంతిమంగా కొనుగోలు దారులు నష్టపోతారన్నారు. ఈ క్రమంలో ముందస్తుగా తాము ప్రత్యేక కార్యాచరణతో చర్యలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. నిబంధనలు పాటిస్తే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని, లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, వీఆర్వో బాషా పాల్గొన్నారు.

స్వచ్ఛజలం.. అందేనా?

(5వ పేజీ తరువాయి)

కొరవడింది. పల్నాడు జిల్లా పరిధిలోని గ్రామాల్లో 4,34,399 గృహాలు ఉండగా ఇంకా 2,29,067 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలి. 33.88 శాతంతో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా చిట్టచివరన 26వ స్థానంలో నిలిచింది. ఈ పథకం కింద 1055 పనులు గుర్తించి రూ.508.16 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. మూడో వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. బాపట్ల జిల్లా జలజీవన్ అమలులో రాష్ట్రంలో 25వ స్థానంలో నిలిచింది. జిల్లా పరిధిలోని గ్రామాల్లో 3,64,788 గృహాలకు 1,48,361 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. రూ.205.22 కోట్లు వ్యయం అంచనాతో జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టగా 223 పనులు పూర్తి చేశారు. గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలకు 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతంతో జిల్లా 15వ స్థానంలో నిలిచింది. 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా పనుల్లో కదలిక కనిపించడంలేదు. కూటమి ప్రభుత్వం పనులను వేగవంతం చేయాలని గ్రామీణులు కోరుతున్నారు.

నూరు శాతం గ్రామాలివే

- పల్నాడు జిల్లాలో కేవలం 14 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయిల కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. అమరావతి మండల జూపూడి, చిలకలూరిపేట మండలం దండమూడి, గొట్టిపాడు, కుక్కపల్లివారిపాలెం, పోతవరం, తాతపూడి, వేలూరు, యడ్లపాడు మండలం సందెపూడి, సొలస, మాచవరం మండలం చెన్నాయపాలెం, నాదెండ్ల మండలం చిరుమామిళ్ల, సంకురాత్రిపాడు, రెంటచింతల, వినుకొండ మండలం విఠంరాజుపల్లి గ్రామాల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్లు ఉన్నాయి.
- బాపట్ల జిల్లాలో పది గ్రామాల్లోనే నూరుశాతం కుళాయిలు ఇచ్చారు. అమృతలూరు మండలం కోడితాడిపర్రు, ఇంకొల్లు మండలం భీమవరం, ఇడుపులపాడు, జే పంగులూరు మండలం చందలూరు, నూజెళ్లపల్లి, రామకుర్రు, కారంచేడు మండలం కుంకలమర్రు, పర్చూరు మండలం అడుసుమల్లి, యద్దనపూడి మండలం వింజనంపాడులో ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చారు.
- గుంటూరు జిల్లా పరిధిలో చేబ్రోలు మండలం గొడవర్రు, కాకుమాను మండలం బీకేపాలెం, బోడిపాలెం, గరికపాడు, పంద్రపాడు, రేటూరు, అన్నవరం, బొమ్మువానిపాలెం, కుంచవరం, మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, పెదకాకాని మండలం అనమర్లపూడి, తక్కెళ్లపాడు, తంగెళ్లమూడి, వెనిగండ్ల, పెదనందిపాడు మండలం కొప్పర్రు, పొన్నూరు మండలం దొప్పలపూడి, జడవల్లి, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, కొండవీడు, తుళ్లూరు మండలం అబ్బరాజు పాలెం, మల్కాపురం, వెలగపూడి, వట్టిచెరుకూరు మండలం కొవెలమూడి, కర్నూ తల, వట్టిచెరుకూరు, యామర్రు గ్రామాల్లో అన్ని ఇళ్లకు కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుందని అధికారులు తెలిపారు.

నేడు హైస్కూల్‌లో మోడల్ పరీక్ష

మార్టూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉద యం ఎన్‌ఎంఎంఎస్ మోడల్ పరీక్షను అన్ని జడ్పీ హైస్కూల్స్‌లో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు చింతల సుబ్బారావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగమైన ఈ మోడల్ పరీక్షను అందరూ రాయాలని కోరారు.

అద్దంకిలో వరుస దొంగతనాలతో నిఘా పెంచిన పోలీసులు

- రాత్రి సమయంలో శివారు ప్రాంతాలు, ప్రధాన రోడ్లు, శింగరకొండలో తనిఖీలు
- సీసీ కెమెరాలకు మరమ్మతులు



ఆర్టీసీ బస్టాండ్‌లో పరిశీలిస్తున్న ఎస్ఐ

అద్దంకి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలో గత ఐదారు నెలలుగా వరుస దొంగతనాలతో ప్రజలకు కునుకు లేకుండా పోయింది. అదే సమయంలో చోరీలు జరగకుండా చేయడం పోలీస్‌లకు సవాల్‌గా మారింది. ఈ నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో అద్దంకి పోలీసులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలకు బాగు చేయించారు. అదే సమయంలో పగలు, రాత్రి సమయాలలో గస్తీని పెంచారు. సీఐ కృష్ణయ్య, ఎస్ఐ ఖాదర్ బాషా సిబ్బంది తో కలిసి బృందాలుగా ఏర్పడి రాత్రి సమయాల్లో గస్తీని మరింత పెంచారు. ప్రధానంగా నామ్ రోడ్డు వెంబడి, ఆర్టీసీ బస్టాండ్, భవానీసెంటర్, శింగరకొండ గుడి తదితర ప్రాంతాలతో పాటు పట్టణంలోని శివారు ప్రాంతాలలో గస్తీ తిరుగుతున్నారు.



శింగరకొండ దేవాలయం వద్ద విశ్రాంతి హాల్‌లో పరిశీలిస్తున్న ఎస్ఐ ఖాదర్‌బాషా

అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు, యాచకులు, శింగరకొండ గుడి వద్ద భక్తులు ఎక్కువ సంఖ్యలో రాత్రి సమయాలలో నిద్రిస్తుండడంతో ఆయా ప్రాంతాలలో సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి నిఘా పెట్టినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. అదే సమయంలో ప్రజలు కూడా ఒకింత అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు తారస పడితే వెంటనే సమాచారం అందించాలని కోరారు. రాత్రి సమయంలో ఇంటి ఆవరణలో ఖచ్చితంగా లైట్లు వేసి ఉంచాలని, తలుపులకు లోపల వైపున కూడా తాళాలు వేసుకోవాలని సూచిస్తున్నారు.

అమావాస్య పూజలకు భక్తుల తాకిడి

చీరాల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి) : పేరాల గంగా, భ్రమరాంబ సమేత పునుగు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావస్య ప్రత్యేక పూజలకు వేకువజాము నుంచి భక్తులు పోటెత్తారు. గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమార్చన, ఆకాశదీపం, మంత్రపుష్పం తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

ఆసుపత్రిలో పింఛన్ పంపిణీ

పర్చూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ పంపిణీని కూటమి ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహిస్తోంది. శనివారం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్‌లను అందజేశారు. ఆరోగ్యం బాగులేక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలను సేకరించి ఆదివారం ఆసుపత్రికి వెళ్లి పింఛన్‌ను పంపిణీ చేశారు. మండలం నాగులపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు రోడ్డు ప్రమాదంలో గాయపడి చిలకలూరిపేట ఆసుపత్రిలో ఉండగా ఆదివారం గ్రామ కార్యదర్శి అక్కడకు వెళ్లి ఆమెకు పింఛన్‌ను సొమ్ము అందజేశారు.

విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో మెలగాలి

చీరాలటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలగాలని శ్రీగౌతమి జూనియర్ కళాశాల డైరక్టర్ ఎం.వెంకటేశ్వర్లు (ఎంవీ) అన్నారు. 2021-23 ఇక్కడ చదివిన విద్యార్థులు ప్రస్తుతం పలు చోట్ల ఇంజనీరింగ్ చదువుతున్నారు. అయితే అప్పట్లో వీరు ఇంటర్‌లో ఉన్నతమైన మార్కులు సాధించడంతో ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు. ఈసందర్భంగా ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతిభా పురస్కారాలకు ఎంపికయిన వారికి నాలుగు ఏళ్లపాటు ఏటా రూ.58,500 అందుతుందన్నారు. దీంతో అం దరూ వీరిని అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్ ప్రసాద్, అధ్యాపకులు టీవీఎల్ఎన్, వరప్రసాద్, ఎంఎస్ఆర్, ఏవో శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలిరండి

చినగంజాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో జనవరి 5న విశ్వహిందూ పరిషత్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్న హైందవ శంఖారావంలో హిందువులందరూ లక్షలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆర్‌ఎస్ఎస్ జిల్లా సేవా ప్రముఖ్ గుగ్గిలం తులసీరావు పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతం

చినగంజాం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పుజారి రాము ఆధ్వర్యంలో ఆలయంలోని స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలో విశేషంగా అలంకరించిన మండపంలో స్వామి చిత్రపటాన్ని పూలమాలలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు సోమసుందరశాస్త్రి వేదమంత్రాల నడుమ దంపతులచే సామూహికంగా వ్రతాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక మాస వనభోజనాలు చేశారు. ఆలయ సేవాదళ్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా వీరరాఘవస్వామికి పూజలు

చీరాలటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వీర రాఘవస్వామి దేవస్థానంలో ఘనంగా కార్తీకమాస చివరి రోజు వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా 1008 తామర పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరిగా కోటి దీపార్చన చేశారు. భక్తులు విశేషంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ఆలయ కార్య నిర్వహణ అధికారి చిన్ని కృపారావు, దిట్టకవి వాసుదేవాచార్యులు పర్యవేక్షించారు.

సుబ్బరామరెడ్డికి నివాళి

మార్టూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పాతికేళ్ల క్రితం మండలంలోని వలపర్ల గ్రామంలో తమ ట్రస్టు ద్వారా జూనియర్ కాలేజీ ఏర్పాటుకు కృషి చేసిన స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం కళాశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. మాగుంట విగ్రహానికి మాజీ సర్పంచ్ కొల్లిపర పూర్ణచంద్రరావు, నేతాజీ విద్యా సంస్థల డైరక్టర్ సయ్యద్ కరిముల్లా పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తాటికల్లు శాంపిల్స్ సేకరణ

చీరాలటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని దండుబాట, జాండ్రపేట ప్రాంతాల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా తాటి కల్లు శాంపిళ్లను వారు సేకరించారు. అధికారులు మాట్లాడుతూ నాణ్యంగా కల్లు విక్రయాలు జరుగుతున్నాయా లేక ఏదైనా రసాయనాలు కలుస్తున్నాయా తెలుసుకునేందుకు కల్లు శాంపిల్స్ సేకరించినట్లు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. అలాగే సాయి కాలనీలో దాడులు నిర్వహించి అక్రమ మద్యం విక్రయాలు జరుపుతున్న మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద ఉన్న 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడి గల్లంతు

- ముమ్మరంగా గాలింపు
- రంగంలోకి చీరాల అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు



జస్వంత్



జస్వంత్ కోసం గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

వీరన్నపాలెం(పర్చూరు), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చెరువులో ఈతకు వెళ్లిన విద్యార్థి గల్లంతైన సంఘటన బాపట్ల జిల్లా, పర్చూరు మండల పరిధిలోని వీరన్నపాలెం పాలెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. చీరాలలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న పాలేరు జస్వంత్ (17) చెరువులో ఈతకు వెళ్లి గల్లంతయ్యాడు. గ్రామానికి చెందిన పాలేరు శ్రీనివాసరావు, కోకిల దంపతులకు ఇద్దరు కుమారులు, అందులో చిన్న కుమారుడు జస్వంత్. తన స్నేహితులలో కలసి సమీపంలో ఉన్న పాఠశాలలో వాలీబాల్ ఆడుకొని తిరిగి ఇంటికి వస్తూ గ్రామంలోని మంచినీటి చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదానికి గురయ్యాడు. చెరువు లోతుగా ఉండడంతో దిగిన వెంటనే మునిగిపోయాడు. జస్వంత్‌తోపాటు, మరో ఇద్దరు యువకులు కూడా ఉన్నట్లు సమాచారం. గల్లంతైన యువకుని కోసం గ్రామస్థుల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మాల్యాద్రి సిబ్బందితో గ్రామానికి చేరుకొని చీరాల అగ్నిమాపక సిబ్బంది సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ బ్రహ్మయ్య, చీరాల అగ్నిమాపక ఎస్ఐ డీవీ రామకృష్ణ పర్యవేక్షణలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు

కుమారుడు గల్లంతైన సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

హనుమకు కదళీ ఫలార్చన




ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం కదళీఫలార్చన నిర్వహించారు. ప్రాంతఃకాల పూజల అనంతరం వేద పండితులు, పూజారులు 10 వేల అరటిపండ్లతో 11 ఆవృత్తములుగా దశ సహస్ర కదళీఫలార్చన నిర్వహించారు. ఉభయ దాతలుగా గుంటూరుకు చెందిన న్యూ మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.

కార్తీక మాసం చివరి రోజు ప్రత్యేక పూజలు

కార్తీక మాసం చివరి రోజు ఆదివారం శివాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మణికేశ్వరంలోని మల్లేశ్వరస్వామి దేవాలల యం, అద్దంకి పట్టణంలోని కమేశ్వరాలయం, పాతశివాలయం, వేయిస్తంభాల గుడి తదితర దేవాలయాలలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం పోలిస్వర్గం పూజలు నిర్వహించనున్నారు.





మనుబోలు మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న కండలేరు



కావలి రూరల్ : ఈదురు గాలులకు తుమ్మలపెంట రోడ్డులో నేలకూలిన విద్యుత్ స్తంభాలు



నెల్లూరులోని తల్పగిరి కాలనీని చుట్టుముట్టిన వర్షపు నీరు

- తుఫాన్ ప్రభావంతో రోజంతా ఒకటే వాన
- జిల్లాలో సరాసరి వర్షపాతం 43.5 మి.మీ
- లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయం



చిట్టగుంట : తీరప్రాంతంలో ఎగసి పడుతున్న సముద్రపు అలలు

తప్పిన ముప్పు

నెల్లూరు/నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన 'ఫెంగల్' తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఎడతెరపిలేని వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షాలు కురిశాయి. ఆతర్వాత కొంత తెరపిచ్చినా సాయంత్రం మళ్లీ చినుకులు ప్రారంభమయ్యాయి. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నెల్లూరు నగరంలో పలు చోట్ల రోడ్లపై నీరు పారింది. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతా లను పర్యవేక్షించడంతో పాటు పెన్నా పరివాహకంలో వర్షా లను అంచనా వేస్తూ జాగ్రత్తలు తీసుకుంది. ఎట్టకేలకు జిల్లా తుఫాన్ ముప్పు తప్పింది. భారీ వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రజానీకం ఊపిరి పీల్చుకుంది. కాగా ఈ వర్షాలవల్ల ఎక్కడా పంట నష్టం జరగలేదని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

● తీరం దాటినా వర్షం

ఫెంగల్ తుఫాన్ తీరందాటినా జిల్లాలో వర్షం పడుతూనే ఉంది. తుఫాన్ తీవ్ర అల్పపీడనంగా మారిందని అమరావతి వాతావరణశాఖ తెలిపింది. దీని ప్రభావంతో సోమ, మంగళవా రాల్లో తేలిక పాటి నుంచి భారీ వర్షాలు కురుస్తాయని, 40-60కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది.

● సగటు వర్షపాతం 43.5 మి.మీ

జిల్లాలో ఆదివారం సగటు వర్షపాతం 43.5మి.మీగా నమోదైంది. అత్యధికంగా మనుబోలులో 153.2 మి.మీ, అత్యల్పంగా వరికుంటపాడులో 1 మి.మీ వర్షపాతం నమోదైంది. పడిం ది. మండలాల వారీగా వర్షపాతం వివరాలు... ఇందుకూరుపేటలో 110.2, రాపూరు 90.6, నెల్లూరు రూరల్ 85.8, పొదలకూరు 84.8, కొడవలూరు 81.8, ముత్తుకూరు 79.2, బుచ్చి 77.6, సైదాపురం 74.2, టీపీ గూడూరు 72.2, అల్లూరు 70.4, వెంకటాచలం 69.4, కోవూరు 66.4, నెల్లూరు అర్బన్ 63, దగదర్తి 62.6, విడవలూరు 51.6, సంగం 51.4, కలువాయి 41.8, బోగోలు 38.2, ఆత్మకూరు 31.6, చేజర్ల 30.6, కావలి 22.8, ఏఎస్‌పేట 21.6 జలదంకి 20.2, అనంతసాగరం 17.4, కలిగిరి 14.6, ఉలవపాడు 12.4, కందుకూరు 9.2, వలేటివారిపాలెం 9, కాండాపురం7, మర్రిపాడు 6.2, వింజమూరు 6.2, వింజమూరు 6.2, గుడ్లూరు 6, లింగసముద్రం 4.2, దుత్తలూరు 3, ఉదయగిరి 2.8, సీతారాంపురంలలో 2 మి.మీ వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు పేర్కొన్నారు.



రాపూరు : నీటితో కళకళలాడుతున్న కండలేరు జలాశయం

● సోమశిలకు పెరుగుతున్న ఇన్‌ఫ్లో

అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 6,050 క్యూసెక్కుల వస్తుండగా, ఆదివారానికి 6,919 క్యూసెక్కులకు పెరిగింది. పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 69.628 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు 2000, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 100, డెల్టాకు 1800 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నారు.

● కండలేరుకు జలకళ

రాపూరు, (ఆంధ్రజ్యోతి) : కండలేరు జలాశయం నిండుజలాలతో కళకళలాడుతోంది. 68టీఎంసీలు పూర్తి సామర్థ్యం కాగా, ఆదివారం నాటికి నీటి నిల్వ 53 టీఎంసీలను దాటింది. తుఫాన్ ప్రభావంతో ఇన్‌ఫ్లో 4810 క్యూసెక్కులు ఉండగా, అవుట్ ఫ్లో 1095 క్యూసెక్కులుగా ఉన్నది. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది.

- ఉదయం, సాయంత్రం యాప్‌లో హాజరు వేసుకోవాలి
- సాయంత్రం వరకు ఆఫీసులోనే కూర్చోవాలి
- సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం ఆదేశాలు
- ఒకపూట హాజరు వేస్తే అది సెలవు లెక్కే..!
- విధులకు డుమ్మా కొడుతున్న వారి ఆటలకు చెక్
- నేటి నుంచి అమలు



ఇష్టారాజ్యం

ఇక చెల్లదు..!

నెల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం నెల్లూరు నగరంలో కార్పొరేషన్ కమిషనర్ ఓ సచివాలయానికి వెళ్లగా అక్కడ సిబ్బంది లేరు... ఆ తర్వాత ఆయనే మరోసారి ఇంకో సచివాలయానికి వెళ్లగా, మధ్యాహ్నం మూడు గంటలకే తాళాలు వేసి సిబ్బంది అంతా వెళ్లిపోయారు... ఈ రెండు సంఘటనలు పాఠకులకు గుర్తుండే ఉంటుంది. అయితే, ఇకపై సచివాలయాల్లో ఇలాంటి ఆటలు సాగవు. ఒక పద్ధతి అంటూ లేకుండా ఎప్పుడో రావడం, ఇష్టారీతిన వెళ్లిపోవడం ఇక కుదరదు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సచివాలయాల్లో కూర్చోవాల్సిందే.. పని చేయాల్సిందే..! సచివాలయాల పనితీరుపై దృష్టి పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

● ముఖహాజరు తప్పనిసరి

సచివాలయ ఉద్యోగులకు ముఖహాజరు తప్పనిసరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎప్పటి నుంచో ఈ హాజరు పద్ధతి అమల్లో ఉన్నా ఎవరూ పట్టించుకునేవారు కాదు. రోజులో ఏదో ఓ పూట యాప్‌లో హాజరు వేసుకుంటే సరిపోయేది. కానీ ఇప్పుడు ఆ విధానానికి స్వస్తి చెప్పింది. ప్రతీ ఉద్యోగి రోజూ రెండు పూటలా యాప్‌లో హాజరు వేసుకోవాల్సిందే. ప్రభుత్వ పనివేళలు ఉదయం 10 గంటలకు కచ్చితంగా సచివాలయానికి చేరుకొని హాజరు వేసుకోవాలి. ఆ తర్వాత సాయంత్రం 5 గంటలకు యాప్‌లో హాజరు వేసుకున్నాకే తిరిగి వెళ్లాలి. ఈ హాజరు కూడా సచివాలయం ఉన్న కోఆర్డినేట్స్‌కు 500 మీటర్లలోపే వేయాలి. ఎక్కడో కూర్చొని హాజరు వేసుకుందామంటే వీలుకాదు. రెండు పూటలా హాజరు వేసుకుంటేనే ఆ ఉద్యోగి ఆ రోజు విధులకు హాజరైనట్లు పరిగణిస్తారు. ఇప్పటి వరకూ రోజులో ఒక పూట హాజరు వేసి సచివాలయ సిబ్బంది వెళ్లిపోయేవారు. కొందరు విధులకు డుమ్మా కొడుతూ ఉండేవారు. పనివేళల్లో సచివాలయాల్లో ఉండకుండా ఏదో ఒక సమయంలో సచివాలయానికి వచ్చి హాజరు వేసుకొని వెళ్లిపోయేవారు.

> సోమవారం నుంచి రెండు పూటలా యాప్‌లో ముఖ హాజరు పద్ధతిని అనుసరించాలని జిల్లా ఉన్నతాధికారులు టెలీకాన్ఫరెన్స్ ద్వారా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. మరి ఈ సారైనా ఈ హాజరు విధానాన్ని పటిష్టంగా అమలు చేస్తారా..? లేక గతంలో మాదిరి కొన్నాళ్లకు మళ్లీ వదిలేస్తారా..? అన్నది వేచి చూడాలి. కాగా దీనిపై సచివాలయాల జిల్లా నోడల్ అధికారి, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారిని సంప్రదించగా సచివాలయ సిబ్బంది సోమవారం (నేటి) నుంచి రెండు పూటలా హాజరు నమోదు చేసుకోవాలని ఆదేశించామని తెలిపారు.

నేటి నుంచి అమలు

● సుపరిపాలన దిశగా...

జిల్లాలో 769 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 6300 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఒక్కో సచివాలయంలో సరాసరి పది విభాగాలకు చెందిన ఉద్యోగులు ఉంటున్నారు. ప్రజలకు ఏ పని జరగాలన్నా ముందు సచివాలయానికి వెళ్లాల్సి వస్తోంది. అయితే అక్కడి సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ సమయానికి రాకపోతుండడం, పనివేళల కన్నా ముందే వెళ్లిపోతుండడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. చిన్న పనికి కూడా సామాన్యులు రెండు,మూడు సార్లు సచివాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. మండల స్థాయి అధికారులకు కూడా ఇది సమస్యగా మారింది. సమయపాలన పాటించని ఉద్యోగులకు నోటీసులు ఇస్తున్నా, ఇంకా కొందరిలో మార్పు రావడం లేదు. సుపరిపాల కోసం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేస్తే అక్కడ పనిచేస్తున్న కొందరు ఉద్యోగుల మూలంగా ఆ విధానం అభాసుపాలవుతోంది. సచివాలయ సిబ్బంది పనితీరుపై ఇటీవల ఉన్నతాధికారులకు వరుసగా ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో ప్రభుత్వం సచివాలయాల పనితీరుపై దృష్టి పెట్టింది. అక్కడి సిబ్బందిలో బాధ్యత పెంచేందుకు హాజరు నిబంధనను కఠినతరం చేసింది.

కొత్త రేషన్‌కార్డులకు శ్రీకారం

విభజన, మార్పు, చేర్పులకు అవకాశం

సంక్రాంతి కానుకగా అందజేత

కూటమి ప్రభుత్వ నిర్ణయంతో అర్హుల్లో ఆనందం

నేటి నుంచి

దరఖాస్తులు

నెల్లూరు (హరనాథపురం)/సంగం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అర్హులకు కొత్తగా రేషన్‌కార్డులను పంపిణీ చేయడానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం సోమవారం (నేటి) నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఆదేశాలు జారీ చేసింది. కొత్తకార్డులే కాదు.. ఉన్న కార్డుల్లో మార్పులు, చేర్పుల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. గత ప్రభుత్వం రేషన్ పంపిణీని ఓ ప్రహసనంగా మార్చేసింది. అర్హులకు కార్డులు అందించే విషయంలో తీవ్రజాప్యం చేసింది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసే పనిలో భాగంలో అర్హులకు రేషన్ కార్డుల పంపిణీకి అన్నీ చర్యలు చేపట్టింది. ఈనెలాఖరు వరకు దరఖాస్తులు స్వీకరించి, సంక్రాంతి కానుకగా కొత్త కార్డులు అందచేయనున్నది.

● పాతవాటి స్థానే కొత్తవి

ప్రస్తుతమున్న రేషన్‌కార్డుల స్థానంలో కొత్తవి కూడా అందచేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వం రేషన్‌కార్డులకు రంగుమార్చింది. అంతేకాక బియ్యం కార్డులు జారీ చేసింది. రేషన్‌కార్డుపై జగన్, రాజశేఖర్‌రెడ్డిల ఫొటోలు ముద్రించి లబ్ధిదారులకు అందచేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాజముద్రతో రేషన్‌కార్డుల డిజైన్ మార్చాలని నిర్ణయించింది. లేత పసుపు రంగుకార్డుపై ప్రభుత్వ అధికార చిహ్నం ఉన్న నమూనాతో కార్డును రూపొందించినట్లు తెలిసింది. ప్రభుత్వ ఆమోదం తరువాత వీటిని పంపిణీ చేయనున్నారు.

● అన్నింటికీ ప్రామాణికం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు తెల్ల రేషన్‌కార్డు ప్రామాణికంగా మారింది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, దీపం -2 పథకం లబ్ధి, వితంతు, దివ్యాంగులు, వృద్ధులకు పింఛను మంజూరుకు తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండాలి. జిల్లాలో ప్రస్తుతం 7.22 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. అయితే చాలామంది వివాహమైనవారు ఉన్నారు. వీరికి పిల్లలు పుట్టినా కార్డుల్లో పేర్లు లేవు. చాలా కాలం నుంచి రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం లేకపోవడంతో సంక్షేమ పథకాలకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



డీఎస్వో కార్యాలయం

● సచివాలయాల్లో దరఖాస్తు

కొత్త రేషన్‌కార్డులు పొందటానికి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్‌కార్డుతో సచివాలయాలకి వెళ్లి, కొత్తకార్డుకోసం, ప్రస్తుతం ఉన్న కార్డుల్లో మార్పులు చేసుకోడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా కొత్తవాటికి సుమారుగా 10 నుంచి 20 వేలమంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

దరఖాస్తు చేసుకోవాలి



కొత్తగా రేషన్‌కార్డుల కోసం నేటి (సోమవారం) నుంచి సచివాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. కార్డు నుంచి పేరు తొలగింపునకు, పేర్ల రద్దుకు, మార్పులు,చేర్పులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అవకాశం ఈనెలాఖరు వరకు ఉంటుంది.

- డీవీ రమణ, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

హిజ్రాల్లో ఆధిపత్య పోరు

- పాతకక్షల నేపథ్యంలో హాసిని హత్య
- నిందితులు 12 మంది అరెస్టు
- పరారీలో ప్రధాన నిందితుడు, మరో ఇద్దరు
- తెరవెనుక సూత్రధారి అలేఖ్య
- హత్యోదంతంలో పాతనేరస్థుల హస్తం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): హాసిని... ఈమె ఓ ట్రాన్స్‌జెండర్... అనతికాలంలోనే రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల్లోని ట్రాన్స్‌జెండర్లకు నాయకురాలిగా ఎదిగింది.. ఆమె ఉంటే తాము ఎదగలేమని మరికొందరు ట్రాన్స్‌జెండర్లు భావించారు.. హాసినీని ఎలాగైనా అంతమొందించాలని పగబట్టారు.. ఆమెతో వైరమున్న మరికొందరితో చేతులు కలిపారు. అందరూ కలిసి కిరాయి హంతకులతో రూ.20 లక్షలకు డీల్ కుదుర్చుకున్నారు. కొంత నగదు అడ్వాన్స్‌గా ఇచ్చారు. ఆ హంతక ముఠా పక్కా స్కెచ్‌తో హాసినీని కత్తులతో విచక్షణరహితంగా పొడిచి హత్య చేసింది. ఇటీవల జరిగిన ఈ కేసును పోలీసులు ఛేదించారు. సుపారీ ఇచ్చిన ట్రాన్స్‌జెండర్ నాయకురాలు అలేఖ్య, మరో హిజ్రాతో పాటు 10 మంది నిందితులను అరెస్టు చేశారు. కాగా, ఈ కేసులో 15మందిని నిందితులుగా పోలీసులు గుర్తించారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. అతను చిక్కితే ఈ కేసులో అసలు విషయాలు వెలుగులోకి రానున్నాయి.

● కుగ్రామం నుంచి అంతర్రాష్ట్ర స్థాయికి..

తోటపల్లిగూడూరు మండలం చిన్నచెరుకూరుకు చెందిన మానికల హాసిని గ్రామస్థాయి నుంచి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోనూ హిజ్రాలకు నాయకురాలిగా ఎదిగింది. అది చూసి ఓర్వలేక ఆమె బతికి ఉంటే తమ మనుగడ ప్రశ్నార్థకమని మాజీ నాయకురాళ్లు భావించారు. పక్కా స్కెచ్ వేసి అంతమొందించారు.



విలేకరులకు కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

● రూ.20 లక్షల సుపారీ

నెల్లూరు నగరానికి చెందిన పాత నేరస్థుడు భూపతి, నెల్లూరు రూరల్ మండలానికి చెందిన ఓ రౌడీషీటర్ ద్వారా దొరతోపు కాలనీకి చెందిన వంశీ కృష్ణ, అల్లీపురానికి చెందిన కార్తీక్, నాలు గో మైలుకు చెందిన సుబ్రహ్మణ్యం, మస్తాన్ వలీ, వెంకటాద్రి, ఇందుకూరు పేట మండలం జేజేపేటకు చెందిన వంశీ, నాలుగోమైలుకి చెందిన ఓ బాలుడిని, మార్టూరు మండలం ఇసుకదర్శికి చెందిన ఎం రామును ట్రాన్స్‌జెండర్లు సంప్రదించారు. హాసినిని అడ్డుతొలగిస్తే రూ.20 లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకొని, కొంత నగదు ముందుగానే ఇచ్చారు. దీంతో నిందితులు నెల నుంచి హాసిని కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచారు. ఆమె పక్కనే ఉండే ఓ హిజ్రాను మచ్చి క చేసుకుని హాసిని కదలి కలు తెలుసుకుంటూ వచ్చారు. ఈ నెల 26వ తేదీ హాసిని స్వగ్రామంలోని ఆలయం వద్దకు వెళ్లి వస్తుండగా టపాతోపు రైల్వే అండర్ బ్రిడ్జీ వద్ద కాపు కాచి పాశవికంగా హత్యచేసి పరారయ్యారు.

● అతను దొరికితే..

ఈ కేసులో సుపారీ తీసుకున్న పాత నేరస్థుడు మాత్రం దొరకలేదు. ఆ వ్యక్తి ఈ ఏడాది వినాయక చవితి ఉత్స వాలకు హిజ్రా నాయకురాలు అలేఖ్య సాయంతో కొందరు హిజ్రాలను తెలం గాణ నుంచి పిలిపించి ఇక్కడ కార్యక్ర మాలను ఏర్పాటు చేయించారు. మన రాష్ట్రంలో హిజ్రాలు లేరా.. పక్క రాష్ట్రం నుంచి తెప్పించాల్నా.. అంటూ హాసిని అప్పుడు వాళ్లతో గొడవపడి అతడిపై దాడి చేయించిందని, దీంతో అతను పగ పెంచుకొని హత్యకు సుపారీ తీసుకున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ కేసులో పలు చిక్కుముడులు వీడాల్సి ఉంది. అసలు హాసిని ప్రయాణం చేసిన కారు డ్రైవర్ ఏమయ్యాడు. ఈ కేసులో ఎంతమంది పాత్ర ఉందనే ప్రశ్నలకు సమాధానం దొరకాల్సి ఉంది. సుపారీ తీసుకున్న పాత నేరస్థుడు దొరికితే అన్నీ బయటకు వస్తాయి.

నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ అమలు


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ, సీఐలు

కావలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) కొత్త చట్టాలు వచ్చాయని రౌడీషీటర్లు, సస్పెక్టర్లు జాగ్రత్తగా ఉండాలని నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ అమలుచేస్తే జీవితాలు నాశనమవుతాయని కావలి డీఎస్పీ పీ శ్రీధర్ తెలిపారు. కావలి 1,2వ పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్టర్లకు ఆదివారం కావలి పట్టణ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూము ఆవరణలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా రెండో పట్టణ సీఐ గిరిబాబు, రూరల్ సీఐ రాజేశ్వరరావుతో కలసి డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోకపోతే జీవితాంతం ఇబ్బందుల పడతారని హెచ్చరించారు. ప్రవర్తన మార్చుకుని నేరాలకు దూరంగా ఉంటే రౌడీషీట్లను తొలగిస్తామని చెప్పారు. నేరం చేయమని చెప్పే వారు, చేయించే వారు బాగుంటారని చేసిన వాళ్లే నష్టపోతారన్నారు. కావలిలో రౌడీయిజాన్ని సహించమని చెప్పారు. సత్ప్రవర్తన కలిగి రౌడీషీట్లు తొలగించే సమయంలో మళ్లీ ఏదైనా గొడవలతో ప్రమేయం ఉంటే మరో పదేళ్ల వరకు రౌడీషీట్లు కొనసాగతాయని, ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాలనుకున్నా పోలీసుల అనుమతి తీసుకోవాలని, లేకపోతే రాత్రి బీట్ పోలీస్‌లు తనిఖీ చేస్తే మీరు ఇంట్లో లేకపోతే చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రసాద్

ఆత్మకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పురపాలక సంఘం పరిధిలో ఆదివారం ఉదయం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పట్టణంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. తుఫాన్ ప్రభావం మరో రెండు రోజులు ఉన్నందున డ్రైనేజీల్లోని మురికి నీరు రోడ్ల మీదకు ప్రవహించకుండా ముందస్తు చర్య లు చేపట్టారు. బస్టాండ్, సత్రం సెంటర్ తదితర వార్డుల్లోని కాలువల్లో పూడిక పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, శానిటేషన్ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు అర్థరహితం : వైస్ ఎంపీపీ

ఉదయగిరి రూరల్, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆయన వ్యక్తిగత కార్యదర్శిపై విమర్శలు చేయడం అర్థరహితమని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు మట్ల శాంతి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్టీ కాలనీ వాసులతో కలిసి ఆమె విలేఖరులతో మాట్లాడుతూ ఇటీవల ఆనకట్ట ఆధునికీకరణ పనులపై వచ్చిన వదంతులను నమ్మి కొంతమంది గిట్టనివారు ఎమ్మెల్యే, పీఏపై బురదచల్లే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకే పాత గుత్తేదారుకు పని ఇచ్చారని, ఇందులో ఎలాంటి స్వార్థంలేదన్నారు. అర్థరహిత విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలని ఆమె హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మట్ల రామయ్య, లక్ష్మయ్య, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలలకు దుస్తుల పంపిణీ


బాలలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దశరథరామిరెడ్డి

అల్లూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : దేవిరెడ్డి సుబ్బరామిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు డీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత దేవిరెడ్డి సుధాకర్ రెడ్డి, దశరథరామిరెడ్డి, రఘురామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డిల సహకారంతో ఆదివారం మండలంలోని నార్తుఆములూరులోని చైల్డ్ ఆశ్రమంలోని 300 మంది అనాథ బాలబాలికలకు రూ2.50 లక్షల విలువైన దుస్తులు పంపిణీ చేశారు. జూన్‌లో తమ తల్లి వర్ధంతిని పురస్కరించుకొని బాలలందరికీ నోటు పుస్తకాలు పంపిణీ చేస్తామని డీఎస్ఆర్ ట్రస్ట్ సభ్యుడు దేవిరెడ్డి దశరథరామిరెడ్డి తెలిపారు. అనంతరం అందరికీ భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ చైర్మన్ రామచంద్ర శరత్‌బాబు, ట్రస్ట్ సీఈవో అనిల్‌కుమార్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజరు రామచంద్రరావు, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో అమావాస్య ఆదివారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూల విరాట్‌కు క్షీర, పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక సేవ అలవర్చుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

వింజమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక సేవ అలవర్చుకోవాలని శ్రీ వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మందిరం చైర్మన్ బొద్దులూరు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు. అనంతరం శాకాహారం గొప్పదనం వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ధ్యానులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరించుకోవాలి

వింజమూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని జడ్పీటీసీ గంథం బాలకృష్ణారెడ్డి కోరారు. పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు వసతులు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ రేవనూరు శ్రీనివాసులురెడ్డి, కలిగిరి మండల కన్వీనర్ కాటం రవీంద్రరెడ్డి, దుత్తలూరు మండల కన్వీనర్ డి వాసుదేవరెడ్డి, పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆత్మకూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి)1: వెంకట్రావుపల్లి ఎస్టీ కాలనీ సమీపంలో పేకాట స్థావరంపై ఆత్మకూరు సీఐ గంగాధర్ తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడిచేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ26750 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

వైద్యాధికారిణి సేవలకు గుర్తింపు


ప్రశంసాపత్రం అందుకుంటున్న బిజ్జం గీతారెడ్డి

కలిగిరి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి మండలంలోని ప్రజలకు హెచ్‌ఐవీపై అవగాహన కల్పించడం, పరీక్షలు చేయించడం, హెచ్‌ఐవీ బాధితులకు ఏఆర్‌టీలో మందులు సకాలంలో ఇప్పించడం తదితర సేవలు అందించారు. దీంతో ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ నియంత్రణ అధికారి నుంచి జిల్లాకేంద్రంలో ప్రశంసాపత్రం, మె మెంటో అందుకున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యబృందం, వైద్య సిబ్బంది తోపాటు మండల వాసులు వైద్యాధికారిణికి అభినందనలు తెలిపారు.


ఎండీయూ వాహనంపై తొలగని జగన్, వైఎస్ఆర్ బొమ్మలు


ఎండీయూ వాహనంపై తొలగించని జగన్, వైఎస్ఆర్ బొమ్మలు

బిట్రగుంట, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు ముందు కోడ్ అమలులో భాగంగా పార్టీలకు సంబంధించి ప్రచారాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. ఎన్నికల్లో ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయినా నేటికీ ఎండీయూ వాహనాలపై జగన్, వైఎస్ఆర్ బొమ్మలు తొలగించలేదు. బోగోలు పంచాయతీలో ఆదివారం ఓ ఎండీయూ వాహనంపై జగన్, వైఎస్ఆర్ బొమ్మలను కనిపిస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వం పాలన వచ్చి 6 నెలలు కావస్తున్న వాటిని తొలగించే విషయంలో అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ వాహనాలపై ఉన్న బొమ్మలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు.

నిండని చెరువులు... నిరాశలో రైతులు

ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో ఆశించిన మేర కురవని వర్షాలు ● గండిపాళెం జలాశయంలో అరకొరగా ఉన్న నీరు


గండిపాళెం జలాశయంలో అరకొరగా ఉన్న నీరు


శనగ సాగుకు సిద్ధం చేసిన భూమి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయి.. చెరువులు నిండుతాయి.. పంటల సాగుకు ఇబ్బందుల్లేవనుకున్న రైతులకు నిరాశే మిగిలింది. అరకొరగా కురిసిన వర్షాలకు అత్యధిక చెరువుల్లో 20-40 శాతం కంటే నీరు తక్కువగా ఉంది. మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో అక్టోబరు, నవంబరు, డిసెంబరు మాసాల్లోనే వర్షాలు సమృద్ధిగా కురు స్తాయి. అయితే వరుణుడు ముఖం చాటేస్తుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

మరమ్మతులకు నోచుకోని చెరువులు

ఉదయగిరి నియోజకవర్గంలో సుమారు 245 చెరువులు ఉన్నాయి. వాటి పరిధిలో 45 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. దశాబ్దాల తరబడి చెరువులు మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఉన్న అరకొర నీరు వృథా అవుతోంది. ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు వరప్రసాదిని అయిన పొన్నెబోయిన చెంచురామయ్య (గండిపాళెం) జలాశయం పరిధిలో 16 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 35 అడుగులు కాగా ప్రస్తుతం జలాశయంలో 11 అడుగుల మేర నీటిమట్టం ఉంది. ఇక మర్రివూట్ల, నక్కలగండి రిజర్వాయర్ల పరిస్థితి కూడా అలాగే ఉండడంతో ఈ నీటితో ఆరుతడి పంటలు కూడా కష్టమేనని, బోర్లలో సైతం నీరు అడుగంటిపోతోందని రైతులు వాపోతున్నారు.

ఆందోళనలో అన్నదాతలు

ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే సాగులో ఉన్న మినుము, కంది, ఇతరత్రా పంటలు ఎండు దశకు చేరాయి. నియోజవకర్గంలో అత్యధికంగా వరికుంటపాడు, దుత్తలూరు, కలిగిరి, వింజమూరు, కొండాపురం మండలాల్లో రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేస్తారు. రైతులు భూములు దుక్కులు దున్ని పంట సాగుకు వరుణుడి కోసం ఎదురుచూస్తున్నారు. కానీ ఆశించిన మేర వర్షం కురవకపోవడంతో కొంతమంది రైతులు సాగుకు వెనుకడుగు వేస్తుండగా, మరికొంతమంది సాగు చేపట్టారు. ఏదిఏమైనా ఫెంగల్ తుపాన్ మెట్ట ప్రాంత రైతులు, ప్రజలకు నిరాశే మిగిల్చిందని చెప్పాలి.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో విజయం సాధించాలి

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు


సాగునీటి సంఘాల ఎన్నికలపై నేతలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధపడినందున నియోజకవర్గంలోని అన్ని సాగునీటి సంఘాలలో టీడీపీ కూటమి అభ్యర్థులే విజయం సాధించేలా నాయకులు ప్రణాళికాబద్ధంగా కృషిచేయాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ పాలనలో సాగునీటి వ్యవస్థను సర్వనాశనం చేశారని, నిధుల కేటాయింపు కూడా లేక సాగునీటి వనరులు దెబ్బతిన్నాయని విమర్శించారు. సాగునీటి చెరువులకు పునరుజ్జీవం కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీటిసంఘాల ఎన్నికలకు సమాయత్తమయ్యారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, జనిగర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్త రేషన్‌కార్డులకు ఈనెల 2 నుంచి 28 వరకు దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ప్రస్తుతం ఉన్న కార్డులలో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించినందున అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం ఐదేళ్లపాటు రేషన్‌కార్డులు ఇవ్వకపోవడంతో వివాహాలు అయిన వారు, రాజకీయ కారణాలతో రేషన్‌కార్డులు లేనివారు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. అలాగే కార్డులలో మార్పులు, సభ్యుల తొలగింపు, చేర్పులకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు ప్రస్తుతం వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించి అర్హులందరికీ సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు అందజేస్తారని తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని కోరారు.


కావలిరూరల్ : ఒరిగిన స్తంభాలను పైకి లేపుతున్న యంత్రాలు


అల్లూరు : రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

ఎడతెరపిలేని వర్షం.. జనజీవనం అస్తవ్యస్తం

● లోతట్టు ప్రాంతాల జలమయం ● నీట మునిగిన వరి పొలాలు ● ఒరిగిన విద్యుత్ స్తంభాలు


సంగంలో జలమయమైన రోడ్డు

అల్లూరు,(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పొలాలు నీట మునిగాయి. ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ వైర్లు తెగిపోవడంతోపాటు చెట్లు నేల కూలాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. తుఫాన్ ధాటికి తీరప్రాంతాల్లో మత్స్యకారులు ఆందోళనకు గురయ్యారు. అదేవిధంగా వరినాట్లు వేసుకున్న రైతులు ఆందోళన చెందారు. కొన్నిచోట్ల నీరు పోకపోవడంతో తమ పైర్లు నీటిటిలోనే ఉన్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతంలోని గ్రామాలు, పొలాలు జలదిగ్బంధమయ్యాయి. స్వాంపు ప్రాంతంలో నీరు చేరడంతో చెరువుని తలపిస్తోంది.

● కావలి రూరల్ : ఫెంగల్ తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు కావలి మండలం ఆముదాలదిన్నె సమీపంలో ఆదివారం చెన్నాయపాలెం, తుమ్మలపెంట సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా జరిగే 33 కేవీ విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రూరల్ మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లైన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకాంత్ సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఏఈ శ్రీనివాసులురెడ్డి జోరు వానలో క్రేన్, ఎక్స్‌కవేటర్, మరో భారీ వాహనం, 15 మంది సిబ్బందితో నేలకొరిగిన స్తంభాలను పైకి లేపి యుద్ధ ప్రాతిపదికన 4 గంటల మరమ్మతుల అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. తక్కువ సమయంలో శ్రమించి మరమ్మతులు చేయించటం పట్ల ఏఈ, సిబ్బందిని పలువురు అభినందించారు.

● వలేటివారిపాలెం: ఫెంగల్ తుపాన్ ప్రభావంతో గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వలేటివారిపాలెంలోని బీసీ కాలనీలో ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత పదేళ్ల క్రితం బీసీ కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో పాటు సిమెంట్లు రోడ్లు నిర్మించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీతో పాటు సిమెంటు పైపులు ఏర్పాటుచేశారు. అయితే సిమెంటు పైపుల్లోకి వర్షం నీళ్లతో పాటు మట్టి పోవడంతో పూడిపోయాయి. దీంతో వర్షం నీళ్లతో పాటు మురుగునీరు ముందుకు కదలక ఇళ్ల ప్రాంగణంలోనే నిలిచిపోతున్నాయి బీసీ కాలనీలోని డబ్బుగొట్టు కాశయ్య ఇంట్లోకి వర్షం నీరుచేరి దుర్గంధం వెద జల్లడంతో అంటువ్యాధులు ప్రబలుతాయోమోనని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి బీసీ కాలనీలో వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

● సంగం: మండలంలో ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండురోజులుగా కురు స్తున్న వర్షానికి వీధులు, రోడ్లు, లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండ డంతో ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రాలేకపోయారు.

● అనంతసాగరం : ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టకపోవడంతో దోమల వ్యాప్తి ఎక్కువై వ్యాధులు ప్రబలుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు, వాగులు, కాలువల కింద 12వేల ఎకరాల్లో వరిసాగు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం విత్తనాలు చల్లడంతో పాటు, కొన్నిచోట్ల నాట్లు కూడా పూర్తయ్యాయి. ఈక్రమంలో కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందళన చెందుతున్నారు. అలాగే సోమశిల రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడగా అందులో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారు.

ఉధృతంగా కడలి

● బిట్రగుంట : తుపాను ప్రభావంతో ఆదివారం సముద్రపు అలలు ఉధృతంగా ఎగసి పడ్డాయి. బోగోలు మండల తూర్పు తీరప్రాంతం 10 కిలోమీటర్ల సమీపంలో ఉండటంతో తీవ్రంగా చలిగాలులు వీయడంతో ప్రజలు వణికిపోయారు. ఉదయం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుంది. ఇటీవల నాటిన వరి నీట మునిగిపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితిలో ఆవేదన చెందుతున్నారు. ఇదే విధంగా వర్షం కొనసాగితే వేసిన పైరుతో పాటు మిగిలిన నారుమడులు పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.

జగనన్న కాలనీల్లో కనీస వసతులు కరువు

● నత్త నడకన ఇళ్ల నిర్మాణం


దేవరాజుసురాయపల్లిలో బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

సీతారామపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జగనన్న కాలనీల్లో కనీస వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి వెనుకాడుతున్నారు. మండలంలో 629 మందికి ఇళ్లు మంజూరుకాగా ఇప్పటికి 248 గృహాలకు పునాదులు, 80 గృహాలకు స్లాబు వేశారు. 35 గృహాలు మాత్రమే పూర్తిగా నిర్మించారు. అందులో సీతారామపురం సచివాలయ పరిధిలో 33 గృహాలు పూర్తిగా నిర్మించగా, అయ్యవారిపల్లి గ్రామ సచివాలయ పరిధిలో కొన్ని గృహాలకు స్లాబులు వేశారు. మండలంలోని రెండు మూడు సచివాలయాల పరిధిలో మాత్రమే లబ్ధిదారులు ముందుకు వచ్చి నిర్మాణాలు సాగిస్తున్నారు.

కాలనీల్లో కనీస సదుపాయాలు కరువు

కాలనీల్లో అవసరమైన కనీస మౌలిక సదుపాయాలైన రోడ్డు, నీరు, కరెంట్ వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి వెనుకాడుతున్నారు. దేవరాజుసురాయపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని లబ్ధిదారులు కనీసం నీటి వసతి లేక సుదూర ప్రాంతం నుంచి బిందెలతో తీచ్చుకునే పరిస్థితి నెలకొంది. ప్రస్తుత ప్రభుత్వం జనవరిలోగా మండలంలో కనీసం 76 ఇళ్లను పూర్తి చేయాలని లక్ష్యాలను నిర్దేశించినా నవంబరు 11వ తేదీకి కేవలం 16 ఇళ్లను మాత్రమే పూర్తిచేశారు. పునాది గుంతలు తీసి పట్టా రద్దుకాకుండా జాగ్రత్త పడ్డారు. కనీసం రోడ్డు, నీరు, కరెంట్ వసతులు లేకపోవడంతో ఇల్లు ఎలా కట్టుకోవాలని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. మండలంలో ఏర్పాటుచేసిన కాలనీలలో ఒక్కటంటే ఒక్కచోట కూడా విద్యుత్ సరఫరా ఇవ్వలేకపోవడం గత వైసీపీ ప్రభుత్వం పనితీరుకి అద్దం పడుతోందని మండలంలోని గృహ లబ్ధిదారులతోపాటు సాధారణ ప్రజలు సైతం బాహాటంగానే విమర్శిస్తున్నారు.

నూరు శాతం ఫలితాల సాధనకు కృషి

● తోట శ్రీనివాసులు, ఎంఈవో-2, ఉదయగిరి



ఉదయగిరి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేస్తున్నట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే నూతన విద్యా విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

? నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

! ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అదనంగా ఒక గంట క్లాసు తీసుకుంటున్నారు. అలాగే ప్రతిరోజు ఉపాధ్యాయులు మోడల్ పేపరు పరీక్ష పెడుతున్నారు. జనవరి నుంచి వంద రోజుల కార్యక్రమంలో భాగంగా విజయదీపిక అనే మోడల్ పేపర్ల పుస్తకంతో పరీక్షలు నిర్వహిస్తాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం.

? జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉందా.

! మండలంలోని గండిపాళెం, అప్పసముద్రం, బిజ్జంపల్లి, ఉదయగిరి పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చేస్తున్నాం.

? విద్యార్థులకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.

! ప్రభుత్వం అమలుచేసే విద్యా సంక్షేమ పథకాలు ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు చేపడుతున్నాం.

? మధ్యాహ్న భోజనం పథకంలో మెనూ పాటిస్తున్నారా.

! మధ్యాహ్న భోజనం పథకంలో ప్రభుత్వం సూచించిన మెనూ పాటిస్తూ విద్యార్థులకు రుచికరమైన భోజనం అందిస్తున్నాం. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ఇటీవల ప్రభుత్వం భోజన నిర్వాహకులకు ధరలను సైతం పెంచడంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో సామూహిక రుద్రాభిషేకం


రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

కలువాయి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక అమావాస్య సందర్భంగా ఆదివారం స్థానిక శివాలయంలో కలువాయి శివభక్తి మండలి ఆధ్వర్యంలో సామూహిక రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి సామూహిక దేవి ఖడ్గమాల పూజలు జరిగాయి. భక్తులకు అవసరమైన పూజా సామాగ్రిని శివభక్తి మండలి వారు ఉచితంగా అందజేశారు. భక్తులు సాంప్రదాయ దుస్తులతో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ పూజారి నరసింహరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధి ఏపీవో బదిలీ

కలువాయి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కలువాయి మండల ఏపీవో యం మురళీధర రావును కొండాపురం మండలానికి బదిలీ చేస్తూ డ్వామా పీడీ బి గంగాభవానీ ఉత్తర్వులు జారీ చేశారు. చేజర్ల మండలంలో పనిచేస్తున్న బి వెంకటేశ్వర్లుకు కలువాయి ఇన్‌చార్జి ఏపీవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కలువాయి మండలం చిన్న గోపవరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమా లపై గురువారం గ్రామీణాభివృద్ధి శాఖ చీఫ్ విజిలెన్స్ ఆఫీసరు భవానీ హర్ష స్వయంగా విచారణ జరిపారు. ఆయన చేసిన సూచనలు మేరకు తదుపరి చర్యలు నిమిత్తం కలువాయి ఏపీవోను బదిలీ చేసినట్లు డ్వామా పీడీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం వితరణ


అన్నప్రసాదం స్వీకరిస్తున్న అయ్యప్పస్వామి భక్తులు

జలదంకి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జలదంకిలో అయ్యప్ప మాలాధారణ భక్తులకు జరుగుతున్న 50 రోజుల నిత్య అన్నప్రసాద వితరణలో భాగంగా ఆదివారం లింగసముద్రం తహసీల్దారు సీతామహాలక్ష్మి అన్నప్రసాద వితరణ చేశారు. ఈమె గతంలో జలదంకి తహసీల్దారుగా పనిచేసినప్పటి నుంచి ప్రతి ఏటా ఒకరోజు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప భజనలో పాల్గొన్న తహసీల్దారు తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామస్థులు, అయ్యప్పస్వామి మాలధారణ భక్తులు ఆమెను అభినందించారు.